# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం








సంపుటి: 01 | సంచిక: 311 | హైదరాబాద్ | ఆదివారం | 27-04-2025 | పేజీలు: 08


# ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్

రాహుల్ గాంధీ పర్యటనపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు


ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీపై ప్రశ్నల వర్షం కురిపించిన ఎమ్మెల్సీ కవిత

ఆరు గ్యారంటీల విఫలం.. ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్

రేవంత్ రెడ్డి పాలనలో మానవ హక్కుల ఉల్లంఘనలపై రాహుల్ మౌనంగా ఎందుకు

**హైదరాబాద్, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**
తెలంగాణ పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. "ఎన్నికల సమయంలోనే కనిపించే గాంధీ ఇప్పుడు తెలంగాణకు వచ్చారు. ఆయనను స్వాగతించాల్సిందే... ఎందుకంటే మళ్లీ కనిపించేది ఎన్నికలపూటే" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కవిత తెలిపిన వివరాల ప్రకారం, రాహుల్ గాంధీ ఇప్పటివరకు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితంగా నిలిచాయని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను ఆకర్షించిన కాంగ్రెస్ పార్టీ

మిగతా 2వ పేజీలో..



# పట్టాలెక్కని పెట్టుబడులు...

ఒక్క ఒప్పందమూ కార్యరూపం దాల్చలే!

ఒప్పందాల విలువ రూ. 2లక్షల కోట్లకు పైమాటే

ప్రభుత్వ ప్రకటనలు ఘనం.. ఫలితాలు శూన్యం

ఆచరణలో విఫలమంటూ సర్వత్రా విమర్శలు



2



## కర్రెగుట్టలో కూంబింగ్ నిలిపివేసి.. శాంతి చర్చలు జరపాలి..

02

## రాహుల్ జీ.. కాంగ్రెస్ చేసిన వినాశనం చూడండి



3

# కేసీఆర్ సభపై ప్రజల కంటే కాంగ్రెస్ నాయకులకు ఇంట్రెస్ట్ పెరిగింది..

తెలంగాణ ప్రజల పక్షంలోనే బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆదాయం తగ్గిపోయింది..

కేసీఆర్ సభపై ప్రజల కంటే కాంగ్రెస్ నాయకులకు ఇంట్రెస్ట్ పెరిగింది: హరీష్ రావు



2

## ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే..

ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలు జరుగుతున్నాయి..

మోడ్రన్ సోషల్ మీడియాతో అంతా మారిపోయింది..

ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే నడుస్తుంది..

ప్రతిపక్షాలను అణచివేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి..

విపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు: రాహుల్ గాంధీ



2



కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను

## కాంగ్రెస్ ఆగం చేస్తుంటే బాధ కలుగుతుంది..

రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజల్లో మళ్ళీ ఆశలు చిగురించాయి..

కేసీఆర్ ప్రసంగం వినేందుకు లక్షలాదిగా నేడు వరంగల్ సభకు రానున్నారు..

కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ ఆగం చేస్తుంటే బాధగా ఉంది: శ్రీనివాస్ గౌడ్

2

## కాళేశ్వరం ఈఎన్‌సీ ఇంటిపై ఏసీబీ రైడ్స్

భారీగా ఆస్తులు గుర్తింపు..!

02

## కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్

28 మంది మావోయిస్టులు మృతి..!

03

మదర్సాలోని పిల్లలకు హిందూ సమాజంపై

# ద్వేషం ఎందుకు..?

తెలంగాణ డీజీపీలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు భేటీ..

మదర్సాలోని పిల్లలకు ఏం నేర్పిస్తున్నారో డీజీపీ, సీఎస్ కనిపెట్టాలి..

మదర్సాలోని పిల్లలకు హిందూ సమాజంపై ద్వేషం ఎందుకు?: ఎంపీ రఘునందన్ రావు



2

పాక్ వెన్నులో వణుకుపుట్టేలా

# చర్యలుంటాయ్

తుపాకీ పట్టినోడు ఆ తుపాకికే బలిగాక తప్పదు

ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ట పెహల్గామ్ ఘటన

30 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నామని ఆ దేశ రక్షణ మంత్రి అంగీకరించారు

బిచ్చమెత్తుకునే దుస్థితికి చేరినా పాక్ బుద్ధి మారడం లేదు



2

# దావోస్ నుంచి లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చాం

మహిళలను కోటీశ్వరులను చేయడమే మా అజెండాగా పెట్టుకున్నాం..

ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం: సీఎం రేవంత్



2

కాళేశ్వరం నాణ్యత లోపానికి కారణమైన వాళ్లపై

# చర్యలు తప్పవు

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఉండవని NDSA చెప్పింది

SLBCకి కాళేశ్వరానికి పోలికేంటి

కాళేశ్వరం అంశాన్ని డైవర్ట్ చేయాలని కేటీఆర్ ప్లాన్

కాళేశ్వరం నాణ్యత లోపానికి కారణమైన వాళ్లపై చర్యలు తప్పవు :మంత్రి కోమటిరెడ్డి



3

# పట్టాలెక్కని పెట్టుబడులు...

- ఒక్క ఒప్పందమూ కార్యరూపం దాల్చలే!
- ఒప్పందాల విలువ రూ. 2లక్షల కోట్లకు పైమాటే
- ప్రభుత్వ ప్రకటనలు ఘనం.. ఫలితాలు శూన్యం
- ఆచరణలో విఫలమంటూ సర్వత్రా విమర్శలు

**రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు**

దావోస్ పర్యటన(2024) రూ.40,232కోట్లు
దావోస్ పర్యటన(2025)
రూ.1,78,950కోట్లు
సింగపూర్ పర్యటన(2025)
రూ.3,950కోట్లు
జపాన్ పర్యటన(2025) రూ.12,062కోట్లు

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

రాష్ట్రానికి కనీవినీ ఎరుగని రీతిలో పెట్టుబడులు తెచ్చినట్టు ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ అందులో కార్యరూపం దాల్చినవి మాత్రం ఒక్కటీ కనపడడంలేదు. రెండుసార్లు దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులు, సింగపూర్, అమెరికా, తాజాగా జపాన్ పర్యటన సందర్భంగా ఒప్పందాలు జరిగినట్టుగా ప్రభుత్వం ప్రకటించింది. అవన్నీ కాగితాలకే పరిమితమైనట్టుగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెట్టుబడుల కోసం చేస్తున్న పర్యటనలకు కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతున్నా, వాటితో ఫలితాలు మాత్రం రావడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగావకాశాలను అందుబాటులోకి తేవడంతోపాటు పన్నుల రూపంలో ఆదాయం పెంచుకునే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడుల కోసం కృషి చేయడం సహజం. అనేక రకాల ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు కల్పించి పరిశ్రమలను ఆకర్షిస్తుంటాయి. చేసుకున్న ఒప్పందం కాగితాలు దాటి కార్యరూపం దాల్చినప్పుడే ప్రభుత్వ కృషి సార్థకమైనట్టు భావించవచ్చు.

అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి పురోగతి కానరావడం లేదనేది పరిశ్రమ వర్గాల విమర్శ. ప్రభుత్వం చెబుతున్న పెట్టుబడి లెక్కలు, ఏర్పాటవుతున్న పరిశ్రమలను పరిశీలిస్తే ఈ విమర్శ నూటికి నూరుపాళ్లు వాస్తవమని చెప్పక తప్పదు. ఎందుకంటే.. రెండు దఫాలు దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు సందర్భంగా జరిగిన ఒప్పందాలు ఇంతవరకు ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ఏదైనా పరిశ్రమ ఏర్పాటు కావాలంటే కొంత సమయం పడుతుందనడంలో సందేహం లేదు. అయితే, ఒప్పందం జరిగాక సదరు కంపెనీ తమ పరిశ్రమకు సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించడం, ప్రభుత్వం దాన్ని పరిశీలించి ఆమోదం తెలపడం, అందుకు అనుగుణంగా వారికి కావాల్సిన భూముల కేటాయింపు, రాయితీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయడం వంటి ప్రక్రియ జరగాల్సి ఉంటుంది. అయితే, ఇవేవీ జరుగుతున్న దాఖలాలు లేవు. రెండుసార్లు దావోస్ పర్యటనలు, సింగపూర్, అమెరికా పర్యటనలు, తాజాగా జపాన్ పర్యటన అన్నీ కలుపుకొని రూ. 2లక్షల కోట్లకుపైగా పెట్టుబడి ఒప్పందాలు జరిగినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిసారీ పర్యటనకు సీఎం, మంత్రిసహా పెద్ద సంఖ్యలో అధికార యంత్రాంగం విదేశాలకు వెళ్తున్నది. ప్రతి పర్యటనకూ రూ. 1020కోట్ల వరకూ ప్రజాధనం ఖర్చవుతున్నది.

**ఒప్పందాల వరకే..**

సహజంగా పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు, రాయితీల కోసం టీఎస్ ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. అన్నీ సవ్యంగా ఉంటే అనుమతుల మంజూరీతోపాటు భూ కేటాయింపు జరుగుతుంది. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు సంబంధించి... ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం టీజీఐఐసీ అధికారులు సదరు కంపెనీని సంప్రదించి వారినుంచి పరిశ్రమకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకుంటారు. అయితే, ఒప్పందాల తరువాత ఈ ప్రక్రియేదీ జరగడంలేదు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలు టీజీఐఐసీకి రావడంలేదని అధికారులు చెబుతున్నారు. అంతేకాదు, ఇలా ఒప్పందాలు చేసుకున్నవారు సొంతంగా కూడా టీఎస్ ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడంలేదని వారు పేర్కొంటున్నారు. 'ఒప్పందాలు చేసుకున్న కంపెనీలను మేము ఫాలోఅప్ చేస్తున్నాం. వారు వస్తాం.. వస్తాం, డీపీఆర్‌లు ఇస్తాం అని చెబుతున్నారు కానీ రావడంలేదు. మేము వారిని బలవంతం చేయలేం కదా'. అని ఓ అధికారి పేర్కొన్నారు.

**అంతా వివాదాస్పదం**

మరోవైపు, ప్రభుత్వం చేసుకుంటున్న ఒప్పందాలు చాలావరకు వివాదాస్పదం అవుతున్నాయి. ఉర్సా క్లస్టర్స్ కంపెనీకి కనీసం చిరునామా కూడా లేదనే ఆరోపణలు వెల్లువెత్తగా, మారుబేనీ ఇండియా కంపెనీపై పలు దేశాల్లో కేసులు నమోదైనట్టు తేలింది. అంతేకాదు, ఒప్పందాలు చేసుకున్న చాలావరకు కంపెనీలు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చినవే కావడం విశేషం. అవి తదుపరి విస్తరణ కోసం ప్రస్తుత ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ అవేవీ ఇంకా కార్యరూపం దాల్చడంలేదు.

# మదర్సాలోని పిల్లలకు హిందూ సమాజంపై ద్వేషం ఎందుకు..?

- తెలంగాణ డీజీపీలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు భేటీ..
- మదర్సాలోని పిల్లలకు ఏం నేర్పిస్తున్నారో డీజీపీ, సీఎస్ కనిపెట్టాలి..
- మదర్సాలోని పిల్లలకు హిందూ సమాజంపై ద్వేషం ఎందుకు?: ఎంపీ రఘునందన్ రావు

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

తెలంగాణ డీజీపీ జితేందర్ రెడ్డితో మెదక్ ఎంపీ రఘునందన్ రావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో శివాలయం ధ్వంసం చేసిన పోలీసులు సకాలంలో స్పందించలేదని తెలిపారు. ఘటన మధ్యాహ్నం జరిగితే రాత్రి దాకా పోలీసులు రాలేదు.. కేవలం హిందువుల మీద 4 ఎఫ్ఐఆర్లు పెట్టారు.. నాలుగు పేర్లు రాసి ఆదర్స్ అని రాసి బీజేపీ, హిందూ కార్యకర్తలను ఇష్టం వచ్చినట్టు అరెస్ట్ చేస్తున్నారు.. పక్కన ఉన్న మదర్సాలోని పిల్లలను కూడా హిందువులే పోలీసులకు అప్పజెప్పారు.. ఇప్పటికే 19 మంది జైలుకు పోయారు.. ఇంకా అరెస్ట్ చేస్తూనే ఉన్నారు.. సీసీ కెమెరాలు బాగున్నాయి.. కమాండ్ కంట్రోల్ ఉందని పోలీసులు.. రాత్రి దాకా ఎందుకు స్పందించలేదు అని డీజీపీని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

అయితే, అక్కడ మదర్సాలోఉన్న పిల్లలు ఈ దేశం పిల్లలు అని మీ ఎస్పీ చెప్పగలరా అని ఎంపీ రఘునందన్ రావు అడిగారు. టోపీ పెట్టుకుంటే మనోడు అని కాపాడుతున్నారు.. అక్కడ మదర్సాలో ఉండే 12 ఏండ్లలోపు పిల్లలకు హిందూ సమాజంపై ద్వేషం ఎందుకు..? అని ప్రశ్నించారు. అక్కడ విగ్రహం పగిలిన తర్వాత మదర్స పిల్లలు లోపలికి పోయి వచ్చిన వీడియోలు ఎందుకు బయటకు రావు అని మండిపడ్డారు. రామాలయం జాగాలో మదర్స ఎట్లా వచ్చింది కలెక్టర్.. ఆ మదర్సాలో ఉన్నోళ్లు ఏ దేశం వాళ్లో చెప్పండి అని డిమాండ్ చేశారు. శివ నగర్, సదాశివ పేటలో ఉన్నట్టు వంటి మదర్సాలో ఉన్నోళ్లు ఏ దేశం వాళ్ళు అని అడిగారు. దీంతో పాటు రాష్ట్రంలో ఉన్న ప్రతీ మదర్సాలోని వారందరూ ఏ రాష్ట్రం, ఏ దేశం వాళ్ళు.. వారికి ఏం నేర్పిస్తున్నారో సీఎస్, డీజీపీ చూడాలన్నారు. ఇక, ముత్యాలమ్మ దేవాలయం సంఘటన తర్వాత మీ ఇంటెలిజెన్స్ ఎందుకు వైఫల్యం చెందింది.. అక్కడ ఏం జరిగిందని గుమిగూడిన అందరినీ రిమాండ్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అని రఘునందన్ రావు పేర్కొన్నారు.

ఇక, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భారత ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తెలంగాణతో పాటు హైదరాబాద్ లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్, రోహింగ్యాలను వెళ్లగొట్టకపోతే భాగ్య నగరం మండుతుందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. హైదరాబాద్ లో 70 వేల మంది రోహింగ్యాలు ఉన్నారని అంటున్నారు.. ఇంతకీ ఏం జరుగుతున్నాదని ప్రశ్నించారు. గతంలో డీజీపీ ఆఫీసు మీద బురఖాలో వచ్చి దాడి చేసిన ఘటనను మర్చిపోవద్దని గుర్తు చేశారు. అహింసో పరమో ధర్మో అనేది మా నినాదం కానీ మమ్మల్ని ఇబ్బంది పెడితే హింస ఉంటది అని ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు.

## కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ ఆగం చేస్తుంటే బాధ కలుగుతుంది..

- రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజల్లో మళ్ళీ ఆశలు చిగురించాయి..
- కేసీఆర్ ప్రసంగం వినేందుకు లక్షలాదిగా నేడు వరంగల్ సభకు రానున్నారు..
- కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ ఆగం చేస్తుంటే బాధగా ఉంది: శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజల్లో మళ్ళీ ఆశలు చిగురించాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేసీఆర్ తమకు అండగా ఉన్నారు అనే ధైర్యం మళ్ళీ ప్రజల్లో కలుగుతోంది.. కేసీఆర్ ప్రసంగం వినేందుకు లక్షలాదిగా రేపు వరంగల్ సభకు తరలి రానున్నారు.. ఇప్పటికే రజతోత్సవ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.. కార్యకర్తలు, యువకులు రేపు సభ సజావుగా జరిగేందుకు వాలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు అని పేర్కొన్నారు. ఇక, రేపు తెలంగాణ భవన్ లో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేటీఆర్ గులాబీ జెండా ఎగుర వేస్తారు అని శ్రీనివాస్ గౌడ్ చెప్పుకొచ్చారు.

ఇక, ఆ తర్వాత జలదృశ్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పాంజలి ఘటిస్తారు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో కేసీఆర్ చెప్పే మాటలను సభకు వచ్చే వారు ఊరూరా తిరిగి ప్రచారం చేయాలి అని కోరారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఆగం చేస్తుంటే బాధ కలుగుతుంది అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

## ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్



మొదటిపేజి తరువాయి

వాస్తవంగా ఏ ఒక్క హామీను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని చెప్పిన వాగ్దానం కేవలం అర్థాంతరంగా నిలిచిందని, మహిళలకు తులం బంగారం, నెలకు రూ.2500 ఇస్తామన్న హామీలు కనిపించకుండా పోయాయని కవిత ఆరోపించారు.

అంతేకాదు, రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. ఇటీవల హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై జరిగిన లాఠీ దాడులను, లగచర్లలో బంజారా మహిళలపై జరిగిన అఘాయిత్యాలను గుర్తుచేస్తూ, ఇవన్నీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలన వైఫల్యాలకు నిదర్శనాలని ఆమె పేర్కొన్నారు. ఈ దాడులన్నింటిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా స్పందించిందని గుర్తు చేశారు. సామాన్య ప్రజలు సోషల్ మీడియాలో "కరెంట్ లేదు" అని పోస్ట్ చేస్తే వారిపై కేసులు పెడుతున్న పరిస్థితిలో, తెలంగాణ ప్రజలు నిజమైన ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నారని కవిత తెలిపారు. గ్రూప్ 1 పరీక్షల ఆలస్యంపై విద్యార్థులు ఆందోళన చేస్తున్నా, కాంగ్రెస్ నాయకత్వం మౌనంగా ఉండటం దారుణమని విమర్శించారు.

"రాహుల్ గాంధీ ఎర్ర బుక్ పట్టుకుని దేశమంతా తిరుగుతారు, కానీ తెలంగాణలో రాజ్యాంగ విలువలు తుడిచిపెట్టే చర్యలపై మాత్రం ఒక్క మాట కూడా చెప్పడం లేదు. ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచేలా ఉంది," అని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి తీవ్రంగా సవాల్ విసిరిన కవిత, తెలంగాణ ప్రజలు నిజాన్ని తెలుసుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేర్చబోతున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## పాక్ వెన్నులో వణుకుపుట్టేలా చర్యలుంటాయ్

- తుపాకీ పట్టినోడు ఆ తుపాకికే బలిగాక తప్పదు
- ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ట పెహల్గామ్ ఘటన
- 30 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నామని ఆ దేశ రక్షణ మంత్రి అంగీకరించారు
- బిచ్చమెత్తుకునే దుస్థితికి చేరినా పాక్ బుద్ధి మారడం లేదు

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ట పెహల్గాం ఘటన అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తుపాకీ పట్టినోడు చివరకు ఆ తుపాకీకే బలికాక తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా పాకిస్తాన్ వెన్నులో వణుకుపుట్టేలా చర్యలుండబోతున్నాయని అన్నారు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోందని, ఇందుకు యావత్ దేశం అండగా నిలవాలని కోరారు.

ఈరోజు హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన 'రోజ్ గార్ మేళా' కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు జీఎస్టీ చీఫ్ కమిషనర్లు సందీప్ ప్రకాశ్, వి.సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారికి అత్యంత ఇష్టమైన కార్యక్రమం "రోజ్ గార్ మేళా". 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానన్న మాట నిలబెట్టుకున్న నాయకుడు మోడీ. 2022 అక్టోబర్ 22న 'ప్రారంభమైన రోజ్ గార్ మేళా' నేటికీ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 14 రోజ్ గార్ మేళాలను నిర్వహించి 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేసినం.

ఈరోజు 15వ రోజ్ గార్ మేళా ద్వారా దేశవ్యాప్తంగా 51 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. అంటే దాదాపు 10 లక్షల మార్క్ కు చేరుకున్నట్లే... ఏ చిన్న అవినీతికి, పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా ఇన్ని లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడం మామూలు విషయం కాదు. మోడీ ప్రభుత్వానికి ఆ ఘనత దక్కింది. వాస్తవానికి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలుంటే.. ఇతర ఉద్యోగులపై భారం పడుతోంది. తద్వారా మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సేవలందించడం కష్టమైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు ఏ శాఖలో ఖాళీగా ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు ఆయా పోస్టులను ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసిన దాఖలాల్లేవ్. ఆ ఘనత మోడీకే దక్కుతోంది.

దేశవ్యాప్తంగా ఈరోజు 47 కేంద్రాల్లో రోజ్ గార్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నాం. 51 వేల మందికి అపాయిట్ మెంట్ లెటర్లు ఇవ్వడం గొప్ప విషయం. మన రాష్ట్రం విషయానికొస్తే హైదరాబాద్ సికింద్రాబాద్ లో నిర్వహించుకుంటున్నాం. ఇక్కడ ఎంసీహెచ్ఆర్డీ కేంద్రం నుండి సుమారు 700 మంది అభ్యర్థులు నియామక పత్రాలు అందుకోబోతున్నారు. వీరిలో 100 మంది అభ్యర్థులకు నా చేతుల మీదుగా నియమాక పత్రాలు అందించడం ఆనందంగా ఉంది. ఈరోజు అపాయిట్ మెంట్ లెటర్లు అందుకోబోతున్న అభ్యర్థులకు, వారి కుటుంబ సభ్యులకు నా శుభాకాంక్షలు. వాస్తవానికి ఒక్కో పోస్టుకు భారీ ఎత్తున పోటీ నెలకొంది. ఆ పోటీని తట్టుకుని పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగం సాధించిన మీ అందరికీ హ్యాట్సాఫ్..

# దావోస్ నుండి లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చాం..

- తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానించాం..
- మహిళలను కోటీశ్వరులను చేయడమే మా అజెండాగా పెట్టుకున్నాం..
- ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం: సీఎం రేవంత్

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

హెచ్ఐసీసీలో భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమ్మిట్ లో మాట్లాడటం ఎంతో ఆనందంగా ఉంది.. తెలంగాణకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు.. అయితే, గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు.. అందుకే కాంగ్రెస్ పాలన మీద ప్రజలు ఎక్కువ నమ్మకాన్ని పెట్టుకున్నారని తెలిపారు. ఇక, రూ. 20 వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేశాం.. దేశంలోనే ఇది పెద్ద నిర్ణయం.. రైతు భరోసా పేరుతో రూ. 12000 ఎకరాకు ఇస్తున్నాం.. ఉపాధి హామీ కార్డు దారులకు సాయం చేస్తున్నాం.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమాజంలోని ప్రతి ఒక్కరి ఆకాంక్షలు నెరవేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. భారత దేశ చరిత్రలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నాం.. రూ. 20,617 కోట్లతో రుణమాఫీ చేశాం.. 24/7 ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.. లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

అలాగే, రైతులు మద్దతు ధర కోసం గతంలో ఆందోళనలు చేసేవారు అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కానీ, మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్దతు ధరతో పాటు ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం.. ఇక, ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థులది కీలక పాత్ర పోషించారని చెప్పుకొచ్చారు. కానీ, వారికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. తొలి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం.. 5 లక్షల యువతకు రాజీవ్ యువ వికాసం అమలు చేస్తున్నాం.. ప్రజల ఆకాంక్షలు అర్థం చేసుకుని దాని ప్రకారం ముందుకెళ్లడం కాంగ్రెస్ పార్టీ విధానం అని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించాం.. దావోస్ నుంచి లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చాం.. మహిళలను కోటీశ్వరులను చేయడమే మా అజెండాగా పెట్టుకున్నాం.. మహిళా పారిశ్రామిక వేత్తలను బడా పారిశ్రామిక వేత్తలుగా చేయాలని ఆలోచనతో ముందుకెళ్తున్నాం.. ఆర్టీసీలో మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం.. రాజీవ్ ఆరోగ్య శ్రీ 10 లక్షల వరకు పరిధి పెంచాం.. ఏడాదిలో రూ. 1000 కోట్లు ఖర్చు చేశాం.. మూసి నదిని పునరుజ్జీవం చేసేందుకు కృషి చేస్తున్నాం.. మూసి పెద్ద ఎట్రాక్షన్ కాబోతుంది అని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు.

## కేసీఆర్ సభపై ప్రజల కంటే కాంగ్రెస్ నాయకులకు ఇంట్రెస్ట్ పెరిగింది..

- తెలంగాణ ప్రజల పక్షంలోనే బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది..
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆదాయం తగ్గిపోయింది..
- కేసీఆర్ సభపై ప్రజల కంటే కాంగ్రెస్ నాయకులకు ఇంట్రెస్ట్ పెరిగింది: హరీష్ రావు

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

వరంగల్ జిల్లా చేరుకున్న మాజీమంత్రి హరీష్ రావు కి బీఆర్ఎస్ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభా ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పరిశీలించారు. సభకు వచ్చే కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఇక, హరీష్ రావు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో అతి పెద్ద సభకు వేదిక నిలిచింది.. ఇప్పటికి సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి.. ఇప్పటికే జనం సభకి తరలి వస్తున్నారు.. బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ లేదు.. తెలంగాణ లేకపోతే ఇంత అభివృద్ధి ఉండేది కాదు.. తెలంగాణ ప్రజల పక్షంలోనే బీఆర్ఎస్ ఉంటుంది అని హరీష్ రావు పేర్కొన్నారు.

ఇక, మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఒక్క పథకం ఇవ్వడం లేదని హరీష్ రావు ఆరోపించారు. వాళ్ళు చెప్పిన పథకాలు ఇవ్వకపోయినా.. గతంలో ఉన్న పథకాలు అమలు చేయడం లేదన్నారు. శృతి లేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆదాయం తగ్గిపోయింది.. పాలన చేతకాక రేవంత్ మాట తప్పిండు.. రుణామాఫీ చేస్తానని మోసం చేసిండు.. అసెంబ్లీలో తప్పుడు ప్రకటన చేసి.. రైతులను మోసం చేశారు.. రైతుల కోసం పని చేసింది కేవలం కేసీఆర్ ప్రభుత్వం మాత్రమే.. కాంగ్రెస్ మోసం చేసిన తీరుకు ఈ సభకు అన్ని వర్గాల వాళ్ళు వస్తున్నారు.. కాంగ్రెస్ కు పరిపాలన చేతకాక పంటలను ఎండ బెట్టింది అని హరీష్ రావు మండిపడ్డారు.

అయితే, నీళ్లు లేక కాదు పాలన చేతకాక పంటలను ఎండ బెట్టింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. నీళ్లు ఉన్న పంటలు ఎండిపోయాయంటే.. ఇది చేత కానీ ప్రభుత్వం.. దద్దమ్మ ప్రభుత్వం అంటూ తీవ్రంగా మండిపడ్డాడు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మోటర్లు అన్ చేయకపోవడంతో రాష్ట్రంలో పంటలు ఎండిపోయాయి.. జనం స్వచ్ఛందంగా వచ్చే ప్రయత్నం చేస్తున్నారు.. ఇక, కేసీఆర్ సభ పైనా ప్రజల కంటే కాంగ్రెస్ నాయకులకే ఇంట్రెస్ట్ పెరిగింది అని సెటైర్ వేశారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారు అని కాంగ్రెస్ నేతలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని హరీష్ రావు తెలిపారు.

## ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే..

- ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలు జరుగుతున్నాయి..
- మోడ్రన్ సోషల్ మీడియాతో అంతా మారిపోయింది..
- ఇప్పడంతా మోడ్రన్ రాజకీయమే నడుస్తుంది..
- ప్రతిపక్షాలను అణచివేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి..
- విపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు: రాహుల్ గాంధీ

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):




హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో ఏఐసీసీ నేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్ 2025కు నిన్ననే రావాల్సి ఉండే.. కానీ, కాశ్మీర్ కి వెళ్లాను.. క్షమించండి.. ఈ సమ్మిట్ నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు. ఇక, రాజకీయాల్లో కొత్త జనరేషన్ రావాలి.. ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయి.. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు అని ఆయన తెలిపారు. ఇక, భారత్ జోడో యాత్రలో 4 వేల కిలోమీటర్లు నడిచా.. కన్యాకుమారి నుండి పాదయాత్ర మొదలు పెట్టా.. 10 రోజుల తర్వాత చూస్తే నాతో పాటు నడిచే వారి సంఖ్య పెరిగిపోయింది.. ఈ యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.. సగం దూరం నడిచేటప్పటికి నేను గతంలో లాగా లేను.. ప్రజలతో ఎలా మాట్లాడాలో.. వారి సమస్యలు ఎలా వినాలో నేర్చుకున్నా.. నేను గతంలో ఎప్పుడూ ప్రజలపై ఉన్న ప్రేమను వ్యక్తపరచలేదు అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

కానీ, ఈ పాదయాత్రలో నేను ప్రజలపై నా ప్రేమను వ్యక్త పరచగలిగాను అని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. నేను ఎప్పుడైతే ప్రజలపై నా ప్రేమను వ్యక్త పరిచానో అప్పట్నుంచి అందరూ స్పందిస్తున్నారని తెలిపారు. యాత్రలో కొన్ని సార్లు స్టక్ అయ్యాను.. అప్పటి నుంచి నన్ను చాలా మంది ఇష్టపడటం మొదలు పెట్టారు.. ఓ చిన్న అమ్మాయి వచ్చి లవ్ యూ అని చెప్పింది.. ఆ తర్వాత నేను కూడా నా ఇష్టాన్ని ఎక్స్ ప్రెస్ చేస్తూ వచ్చాను అన్నారు. హిందీలో ఓ స్లోగన్ తీసుకున్నాం.. విద్వేషం అనే బజార్ లో ప్రేమ అనే దుకాణం తెరిచా (నఫ్రత్ కే బజార్ మే.. మే.. మహబత్ కే దుకాన్) అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## కాళేశ్వరం ఈఎన్‌సీ ఇంటిపై ఏసీబీ రైడ్స్

భారీగా ఆస్తులు గుర్తింపు..!

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):



కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై విచారణ తుది దశకు చేరుకుంటున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు కాళేశ్వరం ప్రాజెక్ట్ మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌చీఫ్ (ఈఎన్‌సీ) హరిరామ్ ఇంటిపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా షేక్‌పేట్‌లోని ఆదిత్య టవర్స్ సహా మొత్తం 14 ప్రదేశాల్లో రైడ్స్ జరుగుతున్నాయి. ఈ క్రమంలో భారీగా ఆస్తులు గుర్తించారు. గజ్వేల్ ప్రాంతంలో 30 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 3 బ్యాంక్ లాకర్ల సమాచారం ఏసీబీ అధికారులకు లభించింది. హైదరాబాద్ నగరంలో ఖరీదైన విల్లాలు సైతం ఉన్నట్లు గుర్తించారు.

## కర్రెగుట్టలో కూంబింగ్ నిలిపివేసి.. శాంతి చర్చలు జరపాలి..

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదే పదే ప్రతిపాదనలు పంపిస్తున్నప్పటికీ ఛత్తీస్ ఘడ్ సరిహద్దులోని కర్రెగుట్టలో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తక్షణమే కర్రెగుట్ట అడవులలో కూంబింగ్ నిలిపివేసి.. మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు అంగీకరించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా మారణ హోమం చేయడం సరైన చర్య కాదని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు.

ఇక, అణచివేత ఒక్కటే మార్గం కాదని వాటిని చర్చల ద్వారా పరిష్కరించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు మరోసారి చేసిన ప్రతిపాదనను పెడచెవిన పెట్టడం శ్రేయస్కరం కాదని సూచించారు. ఇప్పటికే మావోయిస్టులు పదుల సంఖ్యలో హతమైనట్లు వార్తలు వస్తున్నాయి.. అలాగే, సాయుధ బలగాలు వడదెబ్బకు గురైనట్లు సమాచారం వస్తుంది.. వీటన్నింటిని పరిగణలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు.

# రాహుల్ జీ.. కాంగ్రెస్ చేసిన వినాశనం చూడండి

## లగచర్ల గ్రామం, సుంకిశాలలో పర్యటించాలి
## కంచ గచ్చిబౌలిని సందర్శించాలని సూచన

**హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న రాహుల్ గాంధీని.. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని కేటీఆర్ కోరారు. లగచర్ల గ్రామం, సుంకిశాల, ఏదైనా హైడ్రా కూల్చివేత ప్రదేశం, మూసీ కూల్చివేతల ప్రాంతం, హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిని సందర్శించాలని 'ఎక్స్' వేదికగా సూచించారు. కలుషితాహారం కారణంగా మరణించిన గురుకుల విద్యార్థుల కుటుంబాలను, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కలవాలన్నారు. కూలిపోయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఫోర్త్ సిటీ, మొదటి ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని






హామీ ఇచ్చిన అశోక్ నగర్‌ను సందర్శించాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన వినాశనం గురించి వినడానికి మీకు 'అద్భుతమైన' సమయం లభిస్తుందని ఆశిస్తున్నాను అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



# కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్

**28 మంది మావోయిస్టులు మృతి..!**

**హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**
తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఐదు రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ కీలక నేతలు హిడ్మా, దేవా టార్గెట్‌గా జరుగుతున్న ఈ ఆపరేషన్‌లో మూడు రాష్ట్రాల నుంచి 20 వేల మందికి పైగా బలగాలు పాల్గొన్నాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం కర్రెగుట్టలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మరణించారని సమాచారం. కర్రెగుట్టలో సుమారు వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. గుట్ట సమీపంలోని ప్రజలు బయటకు రావద్దని ఇప్పటికే ఆంక్షలు విధించారు. ఇక మావోయిస్టుల కోసం రాత్రి పగలు అనే తేడా లేకుండా డ్రోన్ల సాయంతో ఏజెన్సీని భద్రతాబలగాలు జల్లెడ పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు. కాగా, భద్రతా సిబ్బందికి 8 హెలికాప్టర్ల ద్వారా ఆయుధాలు, భోజనాలు, నీటిని సరఫరా చేస్తున్నారు

# రజితోత్సవ సభకు భారీగా తరలి రావాలి

- మహాసభకు కదం తొక్కాలి..
- మాజీ ఎంపిపి ధర్మానగారి గోవర్ధన్ రెడ్డి

**శంకర్ పల్లి ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బిఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహించే పార్టీ రజితోత్సవ సభకు మండలం నుండి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరావాలని శంకర్ పల్లి మాజీ ఎంపిపి గోవర్ధన్ రెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నమ్మి అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్లాలని, రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ



# కాళేశ్వరం నాణ్యత లోపానికి కారణమైన వాళ్లపై చర్యలు తప్పవు

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఉండవని ఎన్‌డీసీఏ చెప్పింది
- ఎస్ఎల్‌బీసీకి కాళేశ్వరానికి పోలికేంటి
- కాళేశ్వరం అంశాన్ని డైవర్ట్ చేయాలని కేటీఆర్ ప్లాన్
- కాళేశ్వరం నాణ్యత లోపానికి కారణమైన వాళ్లపై చర్యలు తప్పవు :మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**
బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నదుల అభివృద్ధి , సంరక్షణ సంస్థ నివేదికలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన డొల్లతనం పూర్తిగా బహిర్గతమైందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు అబద్ధాలు చెప్పడం తప్ప మరేమీ తెలియదని ఎద్దేవా చేశారు. నివేదిక ఆధారంగా తప్పిదాలపై తప్పకుండా చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. కాళేశ్వరం ఎనిమిదో వింతే అని వ్యాఖ్యానించిన కోమటిరెడ్డి.. మూడు సంవత్సరాల్లో నిర్మించి, రెండు సంవత్సరాల్లో కూలిపోయే ప్రాజెక్టు నిజంగానే ఎనిమిదో వింత అంటూ తీవ్రంగా విమర్శించారు. సంరక్షణ సంస్థ నివేదిక ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణాలు మన్నికలేకపోయాయని స్పష్టం అయ్యిందని అన్నారు.
బీఆర్ఎస్ నేతలకు దేవుడు నోరు ఇచ్చాడు తప్ప ఇంకేమీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు పోలిక ఏమిటి? అని ప్రశ్నించారు. కాళేశ్వరంలో నీరు మళ్లించే పనిలో కెటీఆర్ ప్రమేయం ఉందని, అయితే కేటీఆర్‌కు ఏ మాత్రం అవగాహన లేదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు డిజైన్ చేశది కేసీఆర్ అని స్పష్టం చేశారు. నిర్మాణంలో నాణ్యత లోపాలకు కారణమైన అధికారులపై, సంబంధిత వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

# విశాఖ యువ కుడు అద్భుతం

- ట్రైలర్ మేకింగ్ లో దేశంలో 6 వ స్థానం
- తెలుగు రాష్ట్రా ల నుంచి ఒకే ఒక్కడు
- 30 న ముంబయి లో అవార్డు స్వీకరణ
- భారత్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ

**దాబాగార్డెన్స్,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ మే ఒకటి నుంచి నాలుగు వరకు ముంబాయిలో జరగనుంది ఈ సదస్సుని మినిస్ట్రీ ఆఫ్ బ్రాడ్కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో భాగంగా ట్రైలర్ మేకింగ్ క్యాటగిరిలో విశాఖకు చెందిన నిష్ఠల అన్వేష్ టాప్ 20 లో ఆరో స్థానాన్ని దక్కించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా శనివారం వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో అన్వేష్ మాట్లాడుతూ యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్స్ ను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా సినీ పరిశ్రమలో ప్రముఖులతో సినీ పరిశ్రమపై ఆసక్తి ఉన్న ఔత్సాహిక కళాకారులకు సాంకేతిక నిపుణులకు కలిపేందుకు వీలుగా ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. గన్స్ అండ్ గులాబీ అనే వెబ్ సిరీస్ కు తాను ట్రైలర్ రూపొందించానని దానికిగాను ఆరవ స్థానం దక్కిందన్నారు. ఈ నెల 30 న ముంబయి లో అవార్డు లు ప్రధానము చేస్తా రన్నారు.ఈ వేదికను తాను సద్వినియోగపరచుకుంటానని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది నుంచి ప్రతి ఏటా ఈ కార్యక్రమం భారత ప్రభుత్వం నిర్వహిస్తుందని ఔత్సాహికులు అందరూ ఈ వేదికను వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ మన మిత్రుడు,సీనియర్ జర్నలిస్టు మణిశర్మ తనయుడు అన్వేష్ ఈ ఘనత సాధించడం మన జర్నలిస్ట్ కుటుంబాల అందరికీ గర్వకారణం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నాలుగు వేల ఎంట్రీలు వస్తే అన్వేష్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్కడే కావడం అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో ముగ్గురిలో ఒకడు కావడం,సదస్సు ఎంపిక కావడం ,ఈ ఘనత సాధించడం విశాఖకే గర్వకారణం అన్నారు.సదస్సు నుంచి తిరిగి వచ్చిన తర్వాత తానే స్వయంగా మరో అభినందన సభ ఏర్పాటు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు మణిశర్మ మాట్లాడుతూ నా కొడుకు అన్వేష్ కి ఇది ఒక మంచి అవకాశం అని విధిగా తన లక్ష్యం సాధించేందుకు ఈ సదస్సును వినియోగించుకోవాలని అభిప్రాయపడ్డారు.ఈ పోటీల్లో ఈ సినిమా ట్రైలర్ మేకింగ్ క్యాటగిరీని ఐ ఎన్ పి ఆర్ నెట్ ఫిక్స్ తో సంయుక్తంగా నిర్వహించిందని అన్వేష్ సాధించిన ఘనత మేరకు నెట్ ఫ్లిక్స్ కు అర్ధ రైజ్ ఎడిటర్ సర్టిఫికెట్ దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అన్వేష్ కుటుంబ మిత్రులు అధికారుల రవి శాస్త్రి మాట్లాడుతూ చిన్నతనం నుంచే అన్వేష్ తనకు తెలుసని డ్రాయింగ్ పై ఉన్న మక్కువ కారణంగా తన తండ్రి మణిశర్మ గుర్తించి మల్టీ మీడియా కోర్స్ లో చేర్పించడం జరిగిందన్నారు తల్లిదండ్రులు పిల్లల అభీష్టం మేరకు నడుచుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు కార్యక్రమంలో దీపక్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.





# ఈ నెల 27న వరంగల్ లోజరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలి.

**బిఆర్ఎస్ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు భూక్య నాగు నాయక్.**

**చివ్వేంల,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):** ఈనెల 27న వరంగల్ లో నిర్వహిస్తున్న బిఆర్ఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు భూక్య నాగు నాయక్ అన్నారు. శనివారం మొగ్గయ్య గూడెంలో బి ఆర్ ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆవిర్భవించిన ఉద్యమ పార్టీ టిఆర్ఎస్ పార్టీ అని, నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం ప్రధాన ఎజెండగా ప్రజల మధ్యలో ఉంటూ వారి కొరకు పోరాడుతున్న పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన గతి తప్పిందని హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు నాశనం చేసి ప్రభుత్వ భూముల అమ్మకాల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీపిస్తున్నారని తెలియజేశారు. రైతు రుణమాఫీ,పెన్షన్ల రెట్టింపు తదితర హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతూ వారికి అండగా ఉంటుందని అన్నారు.ఈ రజతోత్సవ మహాసభను పార్టీ పటిష్టత కొరకు ప్రజా ఉద్యమ నిర్మాణం కొరకు అధినేత కేసిఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.పార్టీ కార్యకర్తలు,నాయకులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతు వారికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.బిఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పలయ్య,బుక్య వెంకన్న,సిగ శీను,అంజయ్య, చిన్న వాల్యా,వెంకట్ నర్సు, బ్రహ్మచారి,లక్ష్మి,ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- 27న గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలి
- బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు

**జమ్మికుంట,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):** బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ దండులా తరలిరావాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాల కిషన్ రావు మాజీ జెడ్పీటీసీ మాడ వనమాలసాధవ రెడ్డి. పీఏసీఎస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంట్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మండలంలోని వీణవంక వాగు,మానేరు వాగు చెక్ డ్యాంలు నిర్మించి రైతులకు పుష్కలంగా నీరు అందించిన ఘనత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని కొనియాడారురాష్ట్ర సాధన ఉద్యమ పార్టీగా పదేండ్లు అధికార పార్టీగా,17 నెలలు ప్రతిపక్ష పార్టీగా తెలంగాణ ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ పార్టీ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.రజతోత్సవ సభకు తరలివెళ్లడానికి సుమారు 100 బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు,పార్టీ శ్రేణులు 27న గ్రామగ్రామాన బీఆర్ఎస్ జెండాలు ఎగురవేసి స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు.



# పాత్రికేయుల ఆధ్వర్యంలో వాక్ ఫర్ పహల్గామ్ విక్టిమ్స్ కార్యక్రమం

**ఆరిలోవ,ఏప్రిల్ (ప్రజాక్షేత్రం):** జమ్ము కాశ్మీర్ పహల్గామ్ లో భారతీయ పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో అమరులైన వారికి ఆరిలోవ వర్కింగ్ జోనలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆరిలోవ ప్రెస్ క్లబ్) ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం స్థానిక ఆరిలోవ మసీదులకు సంబంధించిన పలువురు ముస్లిం సోదరులు,స్థానిక వాకర్స్ క్లబ్ సభ్యులు, పెద్ద ఎత్తున యువత ఈసంఘీభావ ర్యాలీలో పాల్గొని అమరులకు జోహార్లు అర్పించారు అమాయకులైన పర్యాటకులను విచక్షణరహితంగా కాల్చి చంపిన ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్ లో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకలించాలని, అప్పుడే అమరులైన వారికి మనం అర్పించే ఘన నివాళులని ముక్తకంఠంతో నినదించారు.ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడైన విశాఖ వాసి చంద్రమౌళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.చిన్నగదిలి జంక్షన్,సాయిబాబా గుడి జంక్షన్లలో మానవహారం నిర్వహించి మృతులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ వాక్ ఫర్ విక్టిమ్స్ కార్యక్రమంలో ఆరిలోవ ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు,ముస్లిం సోదరులు,వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు,అధిక సంఖ్యలో యువత తదితరులు పాల్గొన్నారు.




# బిఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభ జయప్రదం చేయాలి:బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు

**చౌటుప్పల్,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** వరంగల్లో జరగబోయే మన భారత రాష్ట్ర సమితి పార్టీ రజితోత్సవసభ జయప్రదం చేయాలని చౌటుప్పలమండల ముఖ్య నాయకుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని అన్ని రంగాలలో అణిచివేత వేయబడుతున్న మన తెలంగాణలో శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు 27 ఏప్రిల్ 2001 లో టిఆర్ఎస్ పార్టీ స్థాపించి ఎన్నో ఉద్యమాలు నడిపించి కేంద్ర ప్రభుత్వాన్ని మెడలువంచి 2014లో ప్రత్యేక తెలంగాణ కెసిఆర్ సారథ్యంలో సాధించుకున్నాం. ఏర్పడిన తెలంగాణని బంగారు తెలంగాణ కావాలని ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చి ప్రజలకు అందించిన ఘనత కేసీఆర్ గారు తెలంగాణని అన్ని రంగాలలో దేశంలోనే అగ్ర బాగానా నిలిపినఘనత కేసిఆర్ గారిది కానీ నేడు ఆచరణ కానీ హామీలు ఆరు గ్యారెంటీలు 420 హామీలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లేసుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నేడు 15 నెలలు అయినా కూడా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో విఫలం చేస్తూ అధికారం అంటే అవినీతి అనే చందంగా ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాలలో దివాలా తీస్తుంది కావున ప్రజలందరినీ మేల్కొని మళ్లీ సారీ రావాలి కేసీఆర్ కావాలి అంటూ గ్రామ గ్రామాన రేపు ఉదయం 9 గంటలకు పార్టీ జెండాలను ఎగురవేసి బస్సులలో ప్రజలు ఉవ్వెత్తున బయలుదేరి వరంగల్లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవసభ జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి,మండల పార్టీ ఉపాధ్యక్షులు చిన్నం బాలరాజు కురుమ,యాట యోగానందం,మాజీ కౌన్సిలర్ తాడూరి పరమేష్,మాజీ గ్రంథాలయ చైర్మన్ ఉడుగు మల్లేష్ గౌడ్,దేవాలయ చైర్మన్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, తోర్పునూరి మల్లేష్ గౌడ్, మునుకుంట్ల నరసింహ గౌడ్, మాజీ సర్పంచులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి,పెద్దింటి చంద్రారెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు కొండ యాదగిరి, సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి,పబతి ఆంజనేయులు గౌడ్, చీమకండ్ల కిష్టయ్య,సమిరెడ్డి జనార్దన్ రెడ్డి,సుర్వి విజయ్ గౌడ్,మాచర్ల కృష్ణ,కడగంచి చలమందరాజు అనిల్ యాదవ్,బత్తుల సింహాచలం, కంకల కృష్ణ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉగ్రవాద దాడిలో మరణించిన కుటుంబానికి 50 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలి

**ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా నాయకులు గుట్టకింది రవి కుమార్ మాదిగ**



**నవాబ్ పేట ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** జమ్మూ కాశ్మీర్ లో ప్రముఖ టూరిస్ట్ స్పాట్ పహల్ గామ్ లో ఉగ్రవాదులు విచక్షణారహితంగా మంగళవారం మధ్యాహ్నం కాల్చి చంపడాన్ని ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా జిల్లా నాయకులు గుట్టకింది రవి కుమార్ మాదిగ తీవ్రంగా ఖండించారు. మరణించిన ప్రతి ఒక్క కుటుంబానికి 50 లక్షల చెల్లించాలని, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తీవ్ర గాయాల పాలై మృత్తితో పోరాడుతున్న వారికి ఆధునిక వైద్యం అందించాలని వారు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం టేకింగ్ కు వెళ్లిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, తమిళనాడు, ఒడిస్సా, మహారాష్ట్ర కర్ణాటక వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకుల టూరిస్టులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 30 మందిని హతమార్చడం చాలా బాధాకరం అన్నారు. ఫిబ్రవరిలో వివాహం చేసుకున్న ఉత్తరప్రదేశ్ చెందిన యువకుడు జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిలో మరణించాడని, హైదరాబాద్ కు చెందిన, విశాఖపట్నం కు చెందిన వారు కూడా ఉండడం చాలా బాధాకరం అన్నారు. తప్పించుకోవడానికి పారిపోతున్న వెంటాడి కాల్చి చంపినట్లు తెలిసిందని ఆయన ఆవేదన చెందారు. ఏది ఏమైనా మృతి చెందిన కుటుంబానికి 50 లక్షల ఎక్సియో కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# ఇటీవల వచ్చిన ఆకాశ రామన్న ఉత్తరాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

**అయ్యప్ప భక్తులు గురుస్వాములు**



**జమ్మికుంట,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):**జమ్మికుంట పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలోని దక్షిణాది రాష్ట్రాలలో దిన దినం అభివృద్ధి దిశలో పురోగమిస్తున్న దేవాలయ ప్రతిష్టను మసక పరచటానికి కొందరు " సూడో" మేధావులు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే నీతిగా నిజాయితీగా దేవాలయ అభివృద్ధికి పాటు పడుతున్న వారిని వారి మనోభావాలను దెబ్బతీయడానికి ఆకాశరామన్న అవతారాన్ని ఎత్తారుఇలాంటి వారి పట్ల ఉదాసీనంగా ఉంటే మనకెందుకులే అని ఊరుకుంటే అరాచక శక్తులు మరింత పేట్రేగి పోయే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ప్రతి ఒక్క అయ్యప్ప భక్తుడు ముందుకు వచ్చి "సూడో" ల చర్యలను తీవ్రంగా ఖండించాలని కోరుతున్నాము.అయ్యప్ప దేవాలయంతో పాటు మరెన్నో దేవాలయాల నిత్య కార్యక్రమాలలో జయందర్ గురుస్వామి తన సహాయ సహకారాలు అందిస్తూ ప్రతి దేవాలయ అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న విషయం అందరికి విదితమే అయ్యప్ప దేవాలయ నిర్మాణంలో పాలు పంచుకున్న వారు దశాబ్ద కాలం దూర దూరంగా ఉన్నప్పటికీ జయందర్ గురుస్వామి ఒక్కరోజు కూడా గుడిని విడవకుండా,ఏలోటు రాకుండా నిత్యం దూప దీప నైవేద్యాలతో ఏలోటు రాకుండా చూసిన విషయం నిజం కాదా అని ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాము.ఇక ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఉదార స్వభావి. మంచి వక్త. ప్రతి విషయం పైన సందర్భోచితంగా అనర్గలంగా మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి పాటు పడుతూ ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నాడు.కాని "సూడో " ల లాగా ఎన్నడూ ప్రవర్తించలేదు.జరగని అవినీతిని జరిగినట్లు చిత్రీకరించడమే కాకుండా తమ అబద్ధపు ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని బుకాయించడం సిగ్గుచేటు. అయ్యప్ప స్వామి భక్తులుగా ఈ దురాగతాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాము. గురుస్వాముల గురించి అవాక్కులు చవాక్కులు రాసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని కోరుతున్నాము.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి
# భూ భారతి

- రైతులకు ఉచిత న్యాయ సేవలు
- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




**మాక్లూర్,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):**

ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించిందని జిల్లా కలెక్టర్ అన్నారు.శనివారం మాక్లూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన రెవెన్యూ చట్టాపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,ఇన్చార్జి ఆర్డీఓ స్రవంతి హాజరయ్యారు.కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్.ఓ.ఆర్ 2025)నూతన చట్టం ద్వారా భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూ కమతాలకు ఆదార్ నెంబర్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. నిర్దిష్ట గడువులోపు భూ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు.ఇదివరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే, రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని అన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని తహసీల్దార్,ఆర్డీఓ స్థాయిలలో పరిశీలించి,నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శేఖర్,ఎంపీడీవో లక్ష్మారెడ్డి,పీఏసీ చైర్మన్ బూరోల్ల అశోక్,సొసైటీ డైరెక్టర్ దయాకర్ రావు,వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వావిలాల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు

**గోపికృష్ణ ఆధ్వర్యంలో కార్మికులు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమం**

**జమ్మికుంట,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):**జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనులను పి. కృష్ణ ఆధ్వర్యంలో కార్మికులు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమా పనులను చేపడుతున్నారు.గ్రామంలో ఉన్నటువంటి వరద కాలువలు,పొలాలకు వెళ్లే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లను, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను కొనసాగిస్తున్నట్లు మేటు పి. కృష్ణ తెలిపారు. స్థానిక అధికారుల సహకారంతో గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఉపాధి హామీ పనులను నిర్వహిస్తున్నట్లు ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని కార్మికులకు పని చేస్తున్న సమయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రధమ చికిత్స కిట్టు, చల్లని మంచి అందిస్తున్నట్లు తెలిపారు.





# అమరుల స్ఫూర్తితో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

- కార్మిక హక్కుల కోసం కార్మికులు కలసి పోరాటం చేయాలి
- చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో మే డే కు సంబంధించిన గోడ పత్రికను విడుదల
- ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి
- జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ కార్మికులకు పిలుపు

**చేవెళ్ల ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ అధ్యక్షతన 139వ మే డేకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి హాజరై కార్మికులతో కలిసి మేడే గోడ పత్రికను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పని దినం కోసం పోరాటం చేసి సాధించుకున్న రోజునే అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా మేడేగా జరుపుకుంటామని అమరుల స్ఫూర్తితో ఏర్పడిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని కార్మికులందరూ కలిసి వాడవాడల పారిశ్రామిక ప్రాంతాలలో లేబర్ అడ్డాల దగ్గర ఘనంగా కార్మికుల పండగ జరుపుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు కేంద్రంలో నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత ఎనిమిది గంటల పని విధానం పోయి 12 గంటల పనిదినాలు కొన్ని రాష్ట్రాలలో అమలు జరుగుతుందని పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాదరాస్తుందని పెట్టుబడి వర్గానికి బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తూ సాధించుకున్న 44 రకాల చట్టాలను నాలుగు కోడలుగా చేసి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు భవిష్యత్తులో కార్మికులు అందరూ కలిసికట్టుగా ఉండి హక్కుల సాధనకై పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల బిఓసి జిల్లా కార్యవర్గ సభ్యులు జై శ్రీనివాస్ రామచందర్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

# మే డే వాడ వాడల ఘనంగా నిర్వహించాలి సిఐటియు

**నాంపల్లి,ఏప్రిల్ 26(ప్రజక్షేత్రం):**ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా నాంపల్లి మండలం లో వివిధ గ్రామాల లో ఎర్రజెండాలు ఎగురవేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ గొల్ల బోయిన అండాలు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కోసం కార్మిక హక్కుల కోసం జరిగిన మహత్తరమైన పోరాటం అమరవీరుల స్ఫూర్తితో అవతరించిన ఎర్రజెండా ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు. నేటి పాలకులు కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న బిజెపి విధానాలపై రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశానంతరం మేడే కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగింది.మేడే సందర్భంగా నాంపల్లి మండల లో సిఐటియు ఆఫీస్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికుల ర్యాలీ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎర్ర జెండాలు ఎగురవేసి ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిపి కార్మికులు,ఆశ వర్కర్లు, హమాలి కార్మికులు, గణేష్,మరియమ్మ,కవిత, సునీత,యాదమ్మ, నీలిమ,లక్ష్మణ్,స్వామి, వెంకటేష్ రవి రాములమ్మ సులోచన,ఈరమ్మ,చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.






## వరంగల్ లో జరిగే ఆవిర్భవ సభను
# విజయవంతం చేయాలి

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య**

**భీంగల్,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**బిఆరఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం వరంగల్ లో నిర్వహిస్తున్న రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి,ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆదేశానుసారం భీంగల్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య సమావేశం నిర్వహించాడు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భీంగల్ మండలం,పట్టణం నుండి 14 బస్సుల్లో 700 మంది పార్టీ నాయకులు కార్యకర్తలను తరలించాలని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు.నేడు ఉదయం 9:00 గంటలలోపు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రతి కార్యకర్త బస్సుల్లోనే బహిరంగ సభకు తరలి రావాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్,మాజీ జెడ్పిటిసి చౌట్ పల్లి రవి,మాజీ జడ్పి కోఆప్షన్ ఎంఏ మోయిజ్,సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య ,శర్మ నాయక్, తూకాజీ నాయక్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్,కౌన్సిలర్లు బొదిరె నర్సయ్య,మూత లింబాద్రి ,మల్లెల ప్రసాద్, సతీష్ గౌడ్,లింగం నాయక్,ఎంఏ రజాక్, పర్స నవీన్,తుమ్మ ముత్తెన్న,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అన్వర్ అలీ జాహేద వివాహ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్

**నారాయణపురం,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**

హైదారాబాద్, అత్తాపూర్ నగరానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి,ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మహ్మద్ అన్వర్ అలీ మహ్మద్ జాహేద వివాహ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.నూతన వధూవరుల లాగా పూలదండలు మార్చుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి కేకు కట్ చేయడం జరిగింది.ఈ వివాహ వార్షికోత్సవ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్ హాజరై వివాహ వార్షికోత్సవ వేడుకలు జరుపుకుంటున్న మహ్మద్ అన్వర్ అలీ జాహేద దంపతులకు శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ యూసుఫ్,మహ్మద్ జానీ,మహ్మద్ అంజత్,అజ్జు,అహ్మద్,అక్రం,అలాస్, అఫ్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

**డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు మైనర్ డ్రైవింగ్ కౌన్సిలింగ్ సెంటర్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ ఆవరణలో ట్రాఫిక్ పోలీస్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ లో పట్టుబడిన వారికీ ఇచ్చే కౌన్సిలింగ్ సెంటర్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు మైనర్ డ్రైవింగ్ లో పట్టుబడ్డ మైనర్లకు, వారి తల్లదండ్రులకు ప్రతి శనివారం కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని ఆయన అన్నారు. కౌన్సిలింగ్ ద్వారా వారి ప్రవర్తనను మార్చుకోవడానికి, తిరిగి బాధ్యత గల పౌరులుగా మారే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. మైనర్లు బైకు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు శిక్షలు కఠినంగా ఉంటాయని లైసెన్స్ లు సీజ్ చేయడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. ఇకముందు మైనర్ డ్రైవింగ్ చేస్తూ కట్టుబడితే మైనర్లను మరియు తల్లిదండ్రులు లేదా యజమానిని మోటార్ వాహనాల చట్టం 2019ప్రకారం 199Aప్రకారం సంబంధిత కోర్టులో హాజరు పరచబడునన్నారు. వాహన యజమానికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు 25వేల జరిమానా వరకు విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ, కృష్ణ, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, సురేందర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు సిబ్బంది, ఉన్నారు.



# కొత్త ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి:తాహసిల్దార్ అశోక్.

ఎన్నికల ప్రక్రియను బలోపితం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు,సూచనలు కీలకమని తహసిల్దార్ అశోక్ పేర్కొన్నారు. శనివారం తమ ఛాంబర్ లో ఓటర్ల సవరణ2025 పోలింగ్ కేంద్రాల మార్పులు,చేర్పుల వివిధ రకాల ఫారములు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.ఓటర్ల సవరణ,బి ఎల్ వోలు,వివిధ రకాల ఫారములు,తదితర అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు మార్పులు కావాలి అనుకుంటే దానికి ఎన్నికల సంఘం వారు అవకాశం ఇస్తారని తెలిపారు.

అనంతరం బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి వారికి తగు సూచనలు చేస్తూ నేటి వరకు మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు.18 సంవత్సరాలు పైబడిన వారికి ఓటర్ నమోదు చేయాలన్నారు.అవసరమైన చోట అదనపు పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేయాలన్నారు. డూప్లికేట్ ఓటర్లను తొలగించాలన్నారు.కొత్తగా పెళ్లయిన మహిళలను జాబితాలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బి ఎల్ ఓ లు అధికారులు పాల్గొన్నారు.




## మా డబ్బులు ఇవ్వరా సార్!
# ధరణి బాధితుల ఆవేదన


- ధరణిలో రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకున్న వారి ఇబ్బందులు
- భూ భారతి రాకతో అయోమయం




**తెలంగాణ బ్యూరో ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**ధరణిలో రిజిస్ట్రేషన్లకు డబ్బులు చెల్లించి స్లాట్ నమోదు చేసుకున్నవారు తరువాత వాటిని పలు కారణాలతో రద్దు చేసుకున్నారు. ఈ నగదును తిరిగి పొందేందుకు చాలా మంది సంవత్సరాల తరబడి కలెక్టర్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతిని అమలులోకి తెచ్చేందుకు సన్నద్ధం అవుతోంది. దీంతో ధరణిలో స్లాట్ రద్దు చేసుకున్న వారిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. అన్నదాతలు వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు, నాలా అనుమతులు, విరాసత్ కోసం, పేర్ల మార్పిడి, ఇంటి రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేసుకున్నారు. అప్పుడు ధరణిలో చూపించినట్లుగా చలానా రూపంలో నగదు చెల్లించారు. వీటిలో అనేక కారణాలతో వారు ఈ స్లాట్లను రద్దు చేసుకున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి చలానా డబ్బులు తిరిగి రావాల్సి ఉంది. కాగా సంవత్సరాల తరబడి డబ్బులు రావడం లేదు. ఆర్డీవో, తహసీల్దార్, కలెక్టర్ ఆఫీస్ల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడకు చెందిన శ్రీలత ఇంటి రిజిస్ట్రేషన్ కోసం రూ.30,000 ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నారు. అందులో గ్రౌండ్ ఫ్లోర్కు మాత్రమే ఆప్షన్ ఉంది. ఫస్ట్ ఫ్లోర్ ఆప్షన్ లేదు. దీంతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఇబ్బందులు తలెత్తుతాయని రిజిస్ట్రేషన్ను రద్దు చేసుకున్నారు. ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్న నగదు తిరిగి ఇప్పించాలని 2020 సంవత్సరంలో వేములవాడ సబ్ రిజిస్టార్కు దరఖాస్తు చేసుకున్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్కు వచ్చింది. ఇప్పటికీ నగదు మాత్రం రాలేదు. ఎల్లారెడ్డిపేటకు చెందిన శివరాత్రి నర్సవ్వ తనకు ఉన్న 1.37 ఎకరాల వ్యవసాయ భూమిని తన కుమార్తె దేవలక్ష్మి పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు ధరణిలో రూ.21,000 స్లాట్ బుక్ చేశారు. వ్యవసాయ భూమిని కూతురు పేరున రిజిస్ట్రేషన్ చేయడానికి కుటుంబసభ్యులు అభ్యంతరం చెప్పారు. స్లాట్ రద్దు చేసుకున్న నగదు తిరిగి ఇప్పించాలని 2022 సంవత్సరంలో హసీల్దార్కు దరఖాస్తు చేసుకున్నారు. మూడు సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి సరైన సమాధానం రావటం లేదు.

**ధరణిలో కనిపించని వివరాలు**

రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది స్లాట్లు రద్దు చేసుకున్న దానికి సంబంధించి కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయి. కాగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధరణిలో వాటి వివరాలు ఏవీ కనిపించవు. అది ఏ స్థాయిలో ఉందనేది చూపించదు. నేరుగా అధికారులను సంప్రదించిన ప్రయోజనం ఉండదు. స్లాట్ రద్దు చేసుకున్న వారు పూర్తి ఆధారాలతో కలెక్టర్ ఆఫీస్లోని ధరణి సమన్వయకర్తను సంప్రదించాలి. వాటిని నిర్ధారించుకున్నాక కలెక్టర్ ఆమోదానికి పంపుతారు. కలెక్టర్ అనుమతితో నగదు చెల్లించేందుకు ఖజానా శాఖకు పంపుతారు. అక్కడ అన్నదాతలు దరఖాస్తులో చూపించిన బ్యాంకు అకౌంట్లో జమ కావాలి. ధరణిలో స్లాట్లు రద్దు చేసుకున్న డబ్బులు అకౌంట్లోకి రావడంలేదు. కలెక్టరేట్లోనూ వీటి పరిశీలన నిలిచిపోయింది. అధికారుల జాప్యంతోనే తమకు నగదు రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.



# డ్రైవింగ్ లైసెన్స్‌కు ఈజీగా అప్లై చేసుకోండిలా కావాల్సిన డాక్యుమెంట్లు ఇవే

- **డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన పత్రాలు ఏవి?**
- **శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ పొందడం ఎలా?**

**హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**వాహనం ఏదైనప్పటికీ డ్రైవింగ్ లైసెన్స్ అనేది తప్పనిసరి. మోటార్ వెహికిల్ చట్టం నిబంధనలు మరింత కఠినంగా మారిన తర్వాత లైసెన్స్ తప్పక తీసుకోవాల్సిన పరిస్థితి. అయితే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కనీసం ఎంత వయసు ఉండాలి? ఏయే ధ్రువపత్రాలు అవసరం? లైసెన్స్ కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి? అనే విషయాలపై చాలా మందికి సందేహాలుంటాయి. ఏం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విధంగా సులభంగా దరఖాస్తు చేసుకోండి.

**డ్రైవింగ్ లైసెన్స్‌కు ఈ విధంగా దరఖాస్తు చేసుకోండి**

డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వ్యక్తికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ముందుగా లెర్నింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్‌కార్డు, అడ్రస్ , వయసు ధ్రువ పత్రాలతో పాటు సెల్‌ఫోన్ నంబర్‌తో మీసేవ లేదా ఇతర కంప్యూటర్ కేంద్రాల్లో ఫీజు చెల్లించి ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. కేటాయించిన రోజు రవాణా శాఖ కార్యాలయానికి(ఆర్టీవో కార్యాలయం) వెళ్లి దరఖాస్తుకు ఆధార్, చిరునామా, వయసు ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను జత చేసి కౌంటర్‌లో అందజేయాల్సి ఉంటుంది. అధికారులు వాటిని పరిశీలించి దరఖాస్తుదారుడి ఫొటో తీస్తారు.

**పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ జారీ ఇలా**

అనంతరం కార్యాలయంలో రహదారి నిబంధనలపై కంప్యూటర్ పరీక్ష(కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) నిర్వహిస్తారు. టెస్ట్‌లో ఇరవై మార్కులకు 12 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు. అర్హత సాధించిన వారికి అధికారులు 6 నెలల కాలవ్యవధితో లెర్నింగ్ లైసెన్స్‌ను జారీ చేస్తారు. ఆరు నెలల్లోపు మళ్లీ వచ్చి శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్(పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్) తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి కూడా ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వారు కేటాయించిన రోజు ఆర్టీఏ ఆఫీస్‌కు వెళ్లాలి. ట్రాక్ వద్దకు వెళ్లి సిబ్బందికి దరఖాస్తును (స్లాట్ పేపర్లు) అందజేయాలి. అధికారుల సమక్షంలో వాహనాన్ని నడపాల్సి ఉంటుంది. తడబాటు లేకుండా నడుపుతున్నట్లు వారు సంతృప్తి చెందినట్లయితే డ్రైవింగ్ లైసెన్స్‌ను జారీ చేస్తారు. డీఎల్ కార్డును పోస్ట్ ద్వారా మీ అడ్రస్‌కు పంపిస్తారు.

# వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించండి.

- **కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే గోడౌన్లకు పంపించండి**
- **అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు**

**వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సదుపాయాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ జి వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం పెద్దమందడి మండలంలోని అల్వాల్ జగత్ పల్లి చిన్న మందడి పెద్దమందడి మణిగిల్ల గ్రామాల వరి కొనుగోలు కేంద్రాలను అదరపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులు సేద తీరేందుకు కొనుగోలు కేంద్రాల్లో టెంట్, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని లేకుంటే సెంటరును మూసివేస్తామని హెచ్చరించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పై ఉందని సూచించారు. అదేవిధంగా తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. లారీలు పెట్టడంలో ఆలస్యం చేయవద్దని, అలా చేస్తే బరువు తగ్గి రైతులు నష్టపోతారని సూచించారు. అనంతరం వెల్టూరు, మదనపూర్ గోదాములు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.




# విద్యార్థులు క్రీడారంగంలో అత్యున్నతమైన ప్రతిభను చాటాలి

**సుల్తానాబాద్ మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య**

**సుల్తానాబాద్, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో అత్యున్నతమైన ప్రతిభను చాటాలని సుల్తానాబాద్ మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య అన్నారు. సుల్తానాబాద్ లోని కో కో ఇండియా సెంటర్ ను ఎంఈఓ రాజయ్య మరియు 202425 విద్యాసంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కనగర్తి జడ్పీహెచ్ఎస్ పీడీ విష్ణు తో కలిసి సందర్శించారు. క్రీడాకారులకు నిలయం సుల్తానాబాద్ అని, భవిష్యత్ లో క్రీడారంగంలో సుల్తానాబాద్ క్రీడాకారులు మరింత ప్రతిభతో ముందుకు వెళ్లాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటిన గెల్లు మధుకర్ సుల్తానాబాద్ లో శిక్షణ ఇవ్వడం సుల్తానాబాద్ ఖో ఖో క్రీడాకారులకు వరం లాంటిదని విష్ణు అన్నారు. ఆటలు మానసికొల్లాసం మరియు శారీరక దారుఢ్యంతో పాటు నాయకత్వ లక్షణాలను నేర్పుతాయని, మంచి పౌరులుగా క్రమశిక్షణతో ఎదగడానికి దోహద పడతాయని ఎంఈఓ రాజయ్య క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం సుల్తానాబాద్ ఎంఈఓ రాజయ్య మరియు పీడీ విష్ణు విద్యార్థులకు స్నాక్స్ అందించారు.



# రాజీవ్ యువ వికాసం పథకం అది ఉంటేనే యువతకు ఉపాధి

- **రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు**
- **యూనిట్లకు బ్యాంకు లింకేజీని తప్పనిసరి చేసిన ప్రభుత్వం**
- **పారదర్శకత పెంచేందుకు, నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు నిర్ణయం**




**తెలంగాణ బ్యూరో ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు చేసే యూనిట్లకు బ్యాంకు లింకేజీని రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాయితీ పోను మిగతా వాటా భరించేందుకు లబ్ధిదారు సిద్ధంగా ఉన్నా, యూనిట్లు మంజూరు చేయకూడదని నిర్ణయం తీసుకుంది. రాజీవ్ యువ వికాసం పథకం అమల్లో పారదర్శకత పెంచేందుకు, నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఇటీవల ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. క్షేత్ర స్థాయిలో పరిశీలన తరువాత అర్హుల జాబితాను బ్యాంకర్లకు పంపించి, ఆ యూనిట్లకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి చేయాలని సూచనలు చేసింది.

**బ్యాంకు లింకేజీ తప్పనిసరి**

రాజీవ్ యువ వికాసం పథకం కింద తెలంగాణ వ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేటగిరీ 1 కింద రూ.50,000 విలువైన యూనిట్‌కు నూరు శాతం రాయితీ ఉంది. బ్యాంకు లింకేజీ లేకుండా ఈ రుణాన్ని అమలు చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేటగిరీ 2, 3, 4లలో యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, లబ్ధిదారు వాటా కింద బ్యాంకు రుణం తీసుకోవాలి. కేటగిరీ 2 కింద యూనిట్ వ్యయం రూ.లక్షలో 10 శాతం, కేటగిరీ 3 కింద రూ.లక్ష రూ.2 లక్షల వరకు 20 శాతం, కేటగిరీ 4 కింద రూ.2 లక్షలురూ.4 లక్షల వరకు 30 శాతం చొప్పున బ్యాంకు లింకేజీ తప్పనిసరి.

**బ్యాంకు రుణం ఇవ్వాలని భట్టి విక్రమార్క ఆదేశాలు**

గతంలో బ్యాంకు రుణాలు సకాలంలో మంజూరు కాకపోవడం, తప్పనిసరిగా లబ్ధిదారు ఇచ్చే రుణానికి పూచీకత్తు పెట్టాలని చెప్పడంతో కొందరికి యూనిట్లు మంజూరు అయినా, రాయితీ విడుదల అయినా పథకం అమలు కాలేదు. ఈ తరహా పరిస్థితులను అధిగమించేందుకు యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, మిగతా మొత్తాన్ని సొంతంగా భరిస్తే యూనిట్ మంజూరు చేయాలన్న చర్చ జరిగింది. ఈ తరహా విధానంతో పథకం లక్ష్యం నెరవేరదని, స్వయం ఉపాధి పథకాలు పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం భావించింది. పథకం కింద ఎంపిక అయిన వారికి తప్పనిసరిగా బ్యాంకు రుణం ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల బ్యాంకర్లను ఆదేశించారు. రుణం కింద బ్యాంకులు రూ.1,600 కోట్లు భరిస్తే దాదాపు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు అవుతాయని భట్టి విక్రమార్క అన్నారు.

**బీసీ సంక్షేమ శాఖకు నిదులు విడుదల**

బీసీ సంక్షేమ శాఖ పరిధిలో కల్యాణ లక్ష్మి, ఉపకారవేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,639.81 కోట్లు విడుదల చేసింది. కల్యాణ లక్ష్మికి రూ.2,173 కోట్లు, బీసీ, ఈబీసీ విద్యార్థుల పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాలు, బోధన ఫీజుల కోసం రూ.2,386 కోట్లు, బీసీ విదేశీ విద్యా నిధి పథకానికి రూ.80 కోట్లు ఇచ్చింది.




# పోస్టాఫీస్ సూపర్ స్కీమ్ రోజుకు రూ.50తో చేతికి రూ.30 లక్షల పైనే లోన్ సౌకర్యం కూడా!

- **గ్రామీణ ప్రాంత ప్రజల కోసం సూపర్ స్కీమ్**
- **తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి!**

**హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**ప్రస్తుత కాలంలో చాలా మంది పొదుపు వైపు అడుగులు వేస్తున్నారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి కుటుంబ సభ్యుల కోసం తమకు తోచినంత డబ్బును ఆదా చేస్తున్నారు. అందుకే పలు పథకాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఇంట్రస్ట్ చూపిస్తున్నారు. అయితే చాలా మంది డబ్బును ఇన్వెస్ట్ చేయడానికి పోస్ట్ ఆఫీసులను సంప్రదిస్తుంటారు. లాభాలు తక్కువగా ఉన్నా సరే, పొదుపు చేయడానికే ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే గోల్డ్, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయడం వంటివి కొంచెం రిస్క్‌తో కూడుకున్నవి. ఈ క్రమంలోనే పోస్టాఫీసు వైపు మొగ్గు చూపుతారు. మరి మీరు కూడా తపాలా శాఖలో పొదుపు చేద్దామనుకుంటున్నారా? అది కూడా చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారా? అయితే మీకోసం అద్దిరిపోయే స్కీమ్ అందుబాటులో ఉంది. అదే "గ్రామ సురక్ష యోజన". దీనిలో పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ తరవాత లక్షల రూపాయలను పొందవచ్చు. మరి, ఈ పథకంలో ఎలా చేరాలి? ఎవరు అర్హులు? ఎంత పెట్టుబడి పెట్టాలి? అనే వివరాలను తెలుసుకుందాం.

**ఏమిటీ గ్రామ సురక్ష యోజన స్కీమ్?**

గ్రామ సురక్ష యోజన పథకం అనేది "రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్ ప్రోగ్రామ్‌లో ఓ భాగం. దేశంలోని గ్రామీణ ప్రాంత ప్రజల కోసం తపాలా శాఖ 1995లో ఈ స్కీమ్‌ను ప్రారంభించింది. ఇక ఇందులో పెట్టుబడి పెట్టాలనుకునే వారు భారతీయులై ఉండి 19 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసులో ఉండాలి. గరిష్టంగా 60 ఏళ్ల టెన్యూర్ వరకు పెట్టుకోవచ్చు. అంటే మెచ్యూరిటీ పీరియడ్ 55 ఏళ్లు, 58 సంవత్సరాలు, 60 ఏళ్లు ఇలా మీకు నచ్చినది ఎంచుకోవచ్చు. ఈ పథకంలో రూ.10వేల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. స్కీమ్‌కు సంబంధించి ప్రీమియం చెల్లించడానికి నెలవారీగా, త్రైమాసికంగా, అర్ధ సంవత్సరంగా వివిధ ఆప్షన్లు ఉన్నాయి. అందులో మీకు నచ్చిన దానిని సెలెక్ట్ చేసుకుని దాని ప్రకారం పెట్టుబడి పెట్టొచ్చు.

**నెలకు ఎంత చెల్లించాలి ?**

గ్రామ సురక్ష యోజన స్కీమ్‌లో చేరిన వ్యక్తి నెలకు రూ.1,515లను పొదుపు చేయాలి. అంటే రోజుకు 50 రూపాయలు. ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెడితే మీరు తిరిగి రూ.30 నుంచి 35 లక్షల వరకు రాబడిని పొందవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తి 19 సంవత్సరాల వయసులో రూ.10 లక్షల ప్రీమియం సెలెక్ట్ చేసుకుంటే, అతను 55 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ.1,515 లను ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. అంటే రోజుకు 50 రూపాయలన్న మాట. అదే అతను 58 సంవత్సరాలు ఎంచుకంటే నెలకు రూ.1,463, 60 సంవత్సరాల వరకైతే రూ.1,411 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రీమియం సకాలంలో చెల్లించకపోతే దానిని 30 రోజుల్లోపు డిపాజిట్ చేయవచ్చు.

**రాబడి ఎలా ఉంటుంది ?**

మీరు ఈ స్కీమ్‌లో ఎన్ని సంవత్సరాలు పొదుపు చేశారు అనే దాని బట్టి మీకు రాబడి వస్తుంది. 55 ఏళ్ల వరకు స్కీమ్‌లో పెట్టుబడి పెడితే మీకు రూ.31.60 లక్షలు తిరిగి వస్తుంది. అదే 58 ఏళ్లకు 33.40 లక్షలు, 60 ఏళ్ల వయస్సు వరకు పెట్టుబడి పెడితే రూ.34.60 లక్షలు మెచ్యూరిటీ సమయంలో వస్తాయి. గ్రామ సురక్ష యోజన స్కీమ్ కింద 80 ఏళ్లు నిండిన వ్యక్తికి ఈ మొత్తాన్ని అందిస్తారు. ఒకవేళ పాలసీదారుడు మరణిస్తే ఈ మొత్తాన్ని ఆ వ్యక్తి చట్టపరమైన వారసులకు లేదా నామినీకి అందిస్తారు. ఈ పాలసీ తీసుకున్న 3 సంవత్సరాల తరవాత పాలసీదారుడు స్వచ్ఛందంగా పథకాన్ని నిలిపేయవచ్చు. కానీ, దీనివల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. అయితే, 5 సంవత్సరాల తర్వాత సరెండర్ చేస్తే బోనస్ వర్తిస్తుంది. పాలసీ తీసుకున్న 4 సంవత్సరాల తర్వాత లోన్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఇక ఈ పాలసీలో ముఖ్యమైనది తపాలా శాఖ అందించే బోనస్. తపాలా శాఖ ప్రకటించిన బోనస్‌లో ప్రతి రూ. 1,000కి సంవత్సరానికి రూ.60 లను బోనస్‌గా అందిస్తుంది.


**ఈ పథకంలో ఎలా చేరాలి**

ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టాలనుకున్నవారు దగ్గర్లోని పోస్టాఫీసుకు వెళ్లి, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలి. మీకు నచ్చితే అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, వివరాలు సమర్పించి ప్రీమియం చెల్లించి పాలసీ కొనుగోలు చేయవచ్చు. పూర్తి వివరాలు ఇండియన్ పోస్ట్ అధికారిక వెబ్‌సైట్‌ను విజిట్ చేయండి. లేదా ఈ లింక్‌పై క్లిక్ చేయండి.

# సుల్తానాబాద్ లో బంద్ ప్రశాంతం.!

**సుల్తానాబాద్, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**

ఉగ్రదాడికి నిరసనగా సుల్తానాబాద్ పట్టణంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. శనివారం బిజెపి ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ మేరకు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. పట్టణ ప్రధాన దారులన్నీ బోసిపోయాయి. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి నిర్వహించి హత మార్చడం హేయమైన చర్య అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులకు ప్రధాని మోడీ దిమ్మతిరిగే సమాధానం చెబుతారన్నారు. ఉగ్ర దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బంద్ లో వ్యాపార, వాణిజ్య సంస్థలు,దుకాణ దారులు పాల్గొన్నారు.



# జమ్మికుంట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా తోట స్వప్న ఏకగ్రీవంగా ఎన్నిక

**జమ్మికుంట,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):**హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆదేశానుసారం జమ్మికుంట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గా మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కర్ర సత్య ప్రసన్న నీయమక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకంతో జమ్మికుంట మండల అధ్యక్షురాలిగా నియమించినందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రివర్యులు శ్రీధర్ బాబు కి డిసిసి అధ్యక్షులు కవంపల్లి సత్యనారాయణ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా నా మీద నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు నేను నా సాయి శక్తుల పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పూర్తి విశ్వాసంతో తెలియజేస్తున్నారు.



# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

- **మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట**
- **శ్రీ నిధి అనేది పేద మహిళల పెన్నిధి**
- **ఇందిరమ్మ ఇండ్లలో అవినీతిని సాహించేది లేదు**
- **పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయరమణ రావు**

**సుల్తానాబాద్, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):** తెలంగాణలోని మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీలను అలాగే 3.75 లక్షల రూపాయలతో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘానికి అందించిన ఆటోను శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు ప్రారంభించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన స్కూల్ డ్రెస్ ల మేకింగ్ ను సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా సంవత్సరానికి రెండు చీరలను మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు ఉపయోగించడానికి వీలు లేకుండా ఇచ్చారని విమర్శించారు. ఇందులో భాగంగా సుల్తానాబాద్ మండల మహిళా సమైక్యకు ఒక బస్సు ఇచ్చేందుకు ప్రభుత్వం మంజూరి ఇచ్చిందన్నారు. ఈ బస్సును ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎంతో ప్రయోజనం పొందడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు గత ప్రభుత్వం రద్దు చేసిన బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించనున్నట్టు చెప్పారు. పేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి అవినీతికి పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు.త్వరలోనే గట్టేపెల్లి నుండి సుల్తానాబాద్ కు కొత్త పైప్ లైన్ మరియు పట్టణంలో మంచినీటి ట్యాంకులను నిర్మిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల రాజమల్లు, సాయిరి మహేందర్, దామోదర్ రావు, అబ్బయ్య గౌడ్, బిరుదు కృష్ణ, చిలుక సతీష్ మరియు అధికారులు,మహిళలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# సర్వేల్ బొడ్రాయి(నాభిశీల) వార్షికోత్సవంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**నారాయణపురం,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండల పరిధిలోని సర్వేల్ గ్రామంలో జరిగిన నాభిశీల బొడ్రాయి వార్షికోత్సవాలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దేవాలయ చైర్మన్ గుత్త శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ నాభిశీల బొడ్రాయి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.వారిని స్థానిక నాయకులు ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెనుముల శంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చిలక రాజు,మాజీ జెడ్పిటిసి వీరమల్ల భానుమతి వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ షబ్బీర్,ఎల్లంకి చంద్రయ్య గౌడ్,బాజా అంజయ్య,బొల్లమల్ల సత్యనారాయణ,బోయ నరసింహ,చిలకరాజు విజయ్, వీరమల్ల వినోద్,సుర్వి గోపీనాథ్,ఎల్లంకి సాయి,ఎస్.కె ఎజాస్,గ్రామ ప్రజలు యువకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.








## తన దేశ పౌరులపై యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదు

- దండకారణ్యంలో ఆదివాసులపై సైనికులు యుద్ధం చేయడం అప్రజాస్వామికం
- కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన ర్యాలీ

**ఖమ్మం,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**తన దేశ పౌరులపైన యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదని, దండకారణ్యంలో ఆదివాసులపై సైనికులు యుద్ధం చేయడం అప్రజాస్వామికమని,కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం శాంతి ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మధ్య భారతదేశంలోని దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' ను వెంటనే ఆపివేయాలని,ఆదివాసులపై జరుగుతున్న మారణహోమాన్ని,దాడిని నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. గత నాలుగు రోజులుగా కర్రిగుట్టలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారా మిలిటరీ బలగాలు వివిధ రాష్ట్రాల బలగాల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ఆపరేషన్ను వెంటనే వెనక్కి పంపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం మన్నారు.తన దేశ పౌరులపైన యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదని దేశ సరిహద్దుల్లో ఉండాల్సినటువంటి సైనికులు దండకారణ్యంలో ఆదివాసులపై యుద్ధం చేయడం అప్రజాస్వామీకం అన్నారు. మరొక ప్రక్క ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించారు కానీ ప్రభుత్వ వైపు నుంచి సానుకూలమైన స్పందన రాకపోవడం వెనుక కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలు ఉన్నాయన్నారు.ఈ దేశ సంపదను కాపాడుకోవడం కోసం ఆదివాసులకు మద్దతుగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతున్నామన్నారు.కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను పాటించి శాంతి చర్చలు జరపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త రవి మారుత్,సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు,డివిజన్ కార్యదర్శి విక్రమ్,ఎర్ర శ్రీనివాస్, సిపిఐ జిల్లా నాయకులు సింగు నరసింహారావు,పోటు కళావతి,శివరామకృష్ణ,సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు,జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు,సర్దార్,ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు,బీఎస్పీ జిల్లా కార్యదర్శి నాగరాజు, తెలంగాణ పీపుల్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్ర రవి,జిల్లా నాయకులు కె.వెంకటేశ్వర్లు, టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర నాయకులు బాబురావు, తాళ్లూరు వేణు,రాష్ట్ర నాయకులు విజయ్, సామాజిక ఉద్యమకారులు అరవపల్లి విద్యాసాగర్, గుంతేటి వీరభద్రం ,పేల్లూరి విజయ్ కుమార్,బీసీ సంఘం నాయకులు పెరుగు వెంకటరమణ,విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు అజిత్ పాషా,నరేందర్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్,దాసరి శ్రీను,దశరథ చావ రమేష్,రవి,సుభాను, కళ్యాణం వెంకటేశ్వరరావు, పరకాల లక్ష్మి, గాంధీ, మోహన్ రావు,ముస్లిం జేఏసీ నాయకులు అబ్దుల్ రెహమాన్,పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

**నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్**



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం ):** పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు ఉచితంగా చదువుకునేందుకు అవకాశం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ సమాజంలో అందరిదీ అని నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ అధ్యక్షతన శనివారం నార్సింగిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు జరిగిన సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకై టీఎస్ చేస్తున్న కృషిని కొనియాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాలల్లోని పిల్లలను తన సొంత పిల్లలుగా భావించి వారికి ప్రేమతో,ఇష్టంతో పాఠాలు బోధించాలని అన్నారు.ప్రతి ఒక్క విద్యార్థికి సమానమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పట్టుదలతో కృషి చేయాలన్నారు టీఎస్ యుటిఎఫ్ నాయకులు తగిన విధంగా స్థలాలు లేని పాఠశాలలకు స్థలాలు కూడా కేటాయించాలని కోరుతూ కనీస వసతులు కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు.చైర్మన్ స్పందిస్తూ మా ప్రభుత్వం ప్రభుత్వ బళ్ళను బలోపేతం చేసేటందుకు తగిన విధంగా కృషి చేస్తుందని, వ్యక్తిగతంగా నా వంతు సహాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తల్లారి మల్లేష్, టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటప్ప,టీఎస్యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్నాథ శర్మ,రఘుపాల్, ఎన్.సుగంధ జిల్లా కార్యదర్శులు జి. భగవంత్ రాజ్ నర్సిములు గౌడ్,బి.బుగ్గ రాములు,బొడ్డుపల్లి రాములయ్య, గండిపేట్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి మాజీద్, వి.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి..

**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 26 (ప్రత్యక్షేత్రం):**సత్రంపాడు సౌభాగ్య లక్ష్మిదేవిగుడి, వినాయక స్వామి గుడి సెంటర్ శనివారం లో మజ్జిగ చలివేంద్రంను ఏలూరు బడేటి రాధా కృష్ణయ్య (చంటి) ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు మాజీ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ శ్రీ బొద్దాని శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ గూడవల్లి వాసు,ఏలూరు టిడిపి సెక్రటరీ రెడ్డి నాగరాజు,టిడిపి నాయకులు డిఎన్ఆర్ నాగేశ్వరరావు,స్థానిక టిడిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన విద్యార్థి ఎన్ హనీఫ్



**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 26 (ప్రజాక్షేత్రం):**లింగపాలెం మండల పరిధిలోని ధర్మాజీ గూడెం గ్రామంలోని శ్రీవిద్య హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఎన్. హనీఫ్ 46వ నెంబర్ 583 మార్కులతో విజయం సాధించారు మండలంలోని సెకండ్ ర్యాంక్ సాధించాడు మండలం ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి:జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు



**వలిగొండ,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ ప్రపంచ కార్మిక దినోత్సవం కార్మికుల యొక్క పండుగ మే 1వ తేదీ మేడేను ఘనంగా జరుపుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం రోజున వలిగొండ వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో సిఐటియు వలిగొండ మండల బాడీ సమావేశం కొండ నరసింహ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన పాండు మాట్లాడుతూ కార్మికులు కర్షకులు రోజుకు 12 గంటల పని విధానం వద్దని తన ప్రాణాలు బలిచి 8 గంటల విధానాన్ని పాలించుకున్న రోజు మే డే రోజు అని అన్నారు.చట్ట సమరంలో చేసేంత వరకు అధికారంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు సాధించుకునే 8 గంటలపని విధానాన్ని వక్రీకరిస్తూ కార్మికుల చేత మేట్టి చేయిస్తున్నాయని విమర్శించారు.చట్టసవరణలు చేసేంతవరకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే గ్రామ గ్రామాన పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్,మండల కార్యదర్శి రాధారపు మల్లేశం,హమాలీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని జంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవల్లి ఎల్లమయ్య,వీరస్వామి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అప్పగించిన సిఐ మురళీ..

**సీఐ మురళికి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు.**




**ఖమ్మం,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**పోగొట్టుకున్న 6 మొబైల్ ఫోన్లను (సీఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు ముదిగొండ ఇన్స్పెక్టర్ సిఐ మురళీ తెలిపారు.మండల కేంద్రం ముదిగొండతో పాటు మండల పరిదిలోని అయా గ్రామలకు చెందిన బాధితులు పోగొట్టుకున్న,చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన సైబర్ సెల్ బృందం సిఐ మురళీ సూచనలతో ముదిగొండ పోలీస్ స్టేషన్ లో యజమానులకు (బాధితులకు) సిఐ మురళీ చేతుల మీదుగా శనివారం అప్పగించారు.ఈ సందర్భంగా సిఐ మురళీ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్పోర్టల్ విధానంతో సుమారు లక్ష రూపాయలు విలువ గల 6 ఫోన్లను బ్లాక్చేసి,వాటిని ట్రేస్చేసి,నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కొక్క మొబైల్ ఫోన్ నలబై ముప్పై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు.ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న,చోరీకి గురైతే పరిస్తితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు.పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు.సెల్ ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సిఐ మురళీ అభినందించారు.

## హైదరాబాద్ విడిచి వెళ్లాల్సిందే.. పాకిస్థానీలకు నోటీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**

నగరంలో ఉన్న నలుగురు పాకిస్థానీలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆదివారం లోగా హైదరాబాద్ను విడిచి వెళ్లాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఈ నలుగురు షార్ట్ టర్మ్ వీసా (ఎస్టీవీ) హోల్డర్స్గా ఉన్నట్లు గుర్తించారు. అలాగే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్లో కలిపి మొత్తం 213 మంది పాకిస్థానీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో నలుగురు షార్ట్ టర్మ్ వీసా మినహాయిస్తే మిగతా అందరికీ లాంగ్ టర్మ్ వీసాలు ఉన్నట్టు తెలుస్తోంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన పాకిస్తానీలకు కేంద్రం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో షార్ట్ టర్మ్ వీసా కలిగిన నలుగురు పాకిస్థానీలకు హైదరాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. తాము ఇచ్చిన గడువులోపు దేశం విడిచి వెళ్లకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో తెలంగాణ పోలీసు శాఖ స్పష్టంగా పేరింది. ఈ నలుగురులో ఇద్దరు పాతబస్తీలో ఉంటుండగా, మరో ఇద్దరు మరో ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఎస్బీ ఇచ్చిన సమాచారంతో నలుగురికి దేశం విడిచి వెళ్లాలంటూ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాగా.. జమ్ముకశ్మీర్లోని పహల్గామ్లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతి చెందారు. ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. ఇందులో భాగంగా భారత్లో ఉన్న పాకిస్థానీల వీసాలు రద్దు చేస్తూ కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 26 తర్వాత పాకిస్థానీయులు దేశం విడిచి వెళ్లాల్సిందే అని కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 27 తరువాత పాకిస్థానీయుల వీసాలు పనిచేయవు. అలాగే మెడికల్పై వచ్చిన పాకిస్థానీయులు వీసాలకు ఏప్రిల్ 29 వరకు గడువు విధించింది కేంద్రం. పాక్ ప్రజల వీసాలు రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. రాష్ట్రాల్లో ఎంత మంది పాకిస్థానీయులు ఉన్నారో గుర్తించి వారిని వెంటనే దేశం విడిచి వెళ్లాల్సిందిగా హెచ్చరికలు జారీ చేశారు. అలాగే తెలంగాణలో ఉన్న పాకిస్థానీయులు కూడా వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని పోలీసులు నోటీసలు జారీ చేస్తున్నారు. రేపటిలోగా రాష్ట్రాన్ని విడిచి స్వదేశానికి వెళ్లిపోవాలని.. ఒకవేళ గడువులోపు దేశం విడిచి వెళ్లని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని తెలంగాణ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



## కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

**బిజెపిలో చేరిన పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు.**



**విశాఖపట్నం,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది .ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఓబీసీ డిపార్ట్మెంట్ ఇన్చార్జ్,సీనియర్ నాయకుడు మూల వెంకట్రావు శనివారం ఉదయం భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.విశాఖ నగరం మురళి నగర్ లో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆయనకు బిజెపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బిజెపి లెజిస్లేటివ్ పార్టీ నాయకుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి విష్ణుకుమార్ రాజు,జిల్లా పార్టీ ప్రెసిడెంట్ పరుశురాం,బిజెపి సీనియర్ నాయకులు సెయిల్ డైరెక్టర్ కాశి విశ్వనాథ్ సమక్షంలో సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి మూల వెంకట్రావు బిజెపిలో చేరారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురు దెబ్బ తగిలినట్లు అయింది. ఆర్థికంగా సామాజికంగా బలమైన మూల వెంకటరావు కాంగ్రెస్ పార్టీని వీడటం ఆ పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేసింది సుమారు రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి మూల వెంకట్రావు ఎనలేని సేవలందించారు.పార్టీ అప్పగించిన ప్రతి కార్యక్రమాన్ని తూచా తప్పకుండా అమలు చేశారు. ముఖ్యంగా బీసీ వర్గాల వారికి ఆయన వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చారు.అలాగే సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో మూల వెంకట్రావు అందరికంటే ముందు వరుసలో ఉండేవారు. ఆధ్యాత్మికంగాను ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం వెంకట్రావుకు ఆశించినంతగా మద్దతు ఇవ్వలేదని ప్రచారం జరుగుతోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుండి టికెట్ ఆశించినప్పటికీ పార్టీ అధిష్టానం పట్టించుకోలేదు. అలాగే పార్టీని నడిపించడంలో కాంగ్రెస్ నాయకుల్లో సమన్వయం లేకపోవడం పట్ల గత కొంతకాలంగా ఆయన నిరాశతో ఉన్నారు.ఈ నేపథ్యంలో పార్టీ మారాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిసింది .ఈ సందర్భంగా మూల వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు శత్రుమూకల నుండి దేశాన్ని రక్షించగలగే నాయకుడు నరేంద్ర మోడీ మాత్రమేనని అందుకే బిజెపిలో చేరినట్లు వెల్లడించారు పార్టీ అధిష్టానం తనకు ఏ బాధ్యతలను అప్పగించినా బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.



## మహిళలను కోటీశ్వరులు గా చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

- మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట
- శ్రీ నిధి అనేది పేద మహిళల పెన్నిధి
- ఇందిరమ్మ ఇండ్లలో అవినీతిని సహించేది లేదు
- పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణ రావు.

**సుల్తానాబాద్,ఏప్రిల్ 26,(ప్రజాక్షేత్రం):** తెలంగాణలోని మహిళలను కోటీశ్వరులు గా చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు అన్నారు.సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీ లను అలాగే 3.75 లక్షల రూపాయలతో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘానికి అందించిన ఆటోను శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు ప్రారంభించారు.అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన స్కూల్ డ్రెస్ ల మేకింగ్ ను సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా సంవత్సరానికి రెండు చీరలను మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు ఉపయోగించడానికి వీలు లేకుండా ఇచ్చారని విమర్శించారు.ఇందులో భాగంగా సుల్తానాబాద్ మండల మహిళా సమైక్య కు ఒక బస్సు ఇచ్చేందుకు ప్రభుత్వం మంజూరి ఇచ్చిందన్నారు.ఈ బస్సును ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎంతో ప్రయోజనం పొందడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు గత ప్రభుత్వం రద్దు చేసిన బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించనున్నట్టు చెప్పారు.పేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి అవినీతికి పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు.త్వరలోనే గట్టేపెల్లి నుండి సుల్తానాబాద్ కు కొత్త పైప్ లైన్ మరియు పట్టణంలో మంచినీటి ట్యాంకులను నిర్మిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్,ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు,సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్,సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల రాజమల్లు,సాయిరి మహేందర్,దామోదర్ రావు, అబ్బయ్య గౌడ్,బిరుదు కృష్ణ, చిలుక సతీష్, అధికారులు,మహిళలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

**చౌటుప్పల్,ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**

మతం మత్తులో పహల్ గావ్ లో 28 మంది టూరిస్ట్లను చంపిన ఉగ్రవాదులను తీవ్రంగా శిక్షించాలని చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని చౌటుప్పల్ బస్టాండ్ నుండి తంగడపల్లి చౌరస్తా వరకు జాతీయ రహదారిపై ఫోటోగ్రాఫర్ మరియు వీడియో గ్రాఫర్ల మండల అధ్యక్షుడు తోర్పునూరి సాయిలు ఆధ్వర్యంలో కొవ్వతులతో ర్యాలీ ని ఫోటోగ్రాఫర్ మరియు వీడియో గ్రాఫర్స్ సభ్యులు నిర్వహించారు.ఇటువంటి చర్యలు మరోసారి పునరావతం కాకుండా కేంద్ర ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్,యాదాద్రి భువనగిరి ఫోటోగ్రఫీ జిల్లా ఉపాధ్యక్షులు యజ్ఞమాచారి జిల్లా సహాయ కార్యదర్శి కాటంరాజు గౌడ్ మండల కోశాధికారి వనం రుషి. మండల సహాయ కార్యదర్శి రోషన్న గారి రాఘవేంద్ర గౌడ్ రిపోర్టర్ మల్లేష్ గౌడ్ ఉడుగు రమేష్ గౌడ్ కందగట్ల కృష్ణ మెట్టు రామచంద్రారెడ్డి కత్తుల రవి బొడిగె ప్రభాకర్ కత్తుల ప్రవీణ్ ఇటుకమల్ల మహేందర్ నల్లంకి మహేష్ లక్కు సతీష్ శ్రీవాసు బాబా మధు శివ డ్రోన్ శివకుమార్ చారి దేశగోని రాజు పల్లెర్ల సుజిక్ చేకూరి రాజు చిరుగుళ్ళ నవీన్ రుద్ర సంతోష్ తీరందాసు రమేష్ బోయ సంపత్ చెరుకు పవన్ బుంగ వంశీ పండు నిఖిల్ చారి తదితరులు పాల్గొన్నారు.





## కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం): ఎమ్మార్పీఎస్, యుడబ్ల్యూడిసి ఆధ్వర్యంలో ఉగ్రవాది దాడుల్లో మరణించిన టూరిస్టుల ఆత్మ శాంతి కై క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ న్యూ అశోక్ నగర్ పార్సిగుట్ట నుండి పార్సిగుట్ట చౌరస్తా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పహల్గాం వద్ద అమాయక పర్యాటకులు మరియు పౌరులపై రాష్ట్ర ప్రాయోజిత ఆటవిక దాడిని మేము తీవ్రంగా ఖండిస్తూ భారతదేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడి, ఈ ప్రాంతంలో శాంతి మరియు సాధారణ స్థితికి తీసుకొస్తారని అని ఆశిస్తూ ఈ దుఃఖ క్షణంలో బాధితుల కుటుంబాలకు భారతదేశము మొత్తం అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్ మాదిగ, అర్బన్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు పిట్టల ఓం ప్రకాష్ ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రసమల్ల బాచి, నేతాజీ విద్య స్థాధల కరస్పాండెంట్ కోట్ల నిరంజన్ రెడ్డి ఎమ్మార్పీఎస్ నాయకులు రఘు మాదిగ, తుమ్మల శివప్రసాద్ మాదిగ, దప్పు మహేష్ మాదిగ, వెంకటేష్ మాదిగ, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షులు లడ్డు, అర్బన్ డెవలప్మెంట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మైక్ సెట్ అశోక్, ఎడ్ల రుద్ర మాదిగ ,మణికంఠ ముదిరాజ్, సిరి, బండ్ల గణేష్ గంగపుత్ర, పవన్ గౌడ్, మధు వీరభద్ర, దప్పు సాయి తేజ, రసమల శివ, కైలాష్, దప్పు అవంతిక, తదితరులు పాల్గొని టూరిస్టులకు ఘన నివాళులర్పించి ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా అక్కడించడం జరిగింది.



## లెక్చరర్ ను చెప్పుతో కొట్టిన విద్యార్థినిపై చర్యలు

- కాలేజీ నుంచి సస్పెండ్ చేసిన యాజమాన్యం
- సెల్ ఫోన్ లాక్కుందని లెక్చరర్ పై దాడి చేసిన స్టూడెంట్
- మనస్తాపంతో రాజీనామా చేసిన లెక్చరర్

హైదరాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):

కాలేజీ లెక్చరర్ పై విద్యార్థిని దాడి చేసిన సంఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. సెల్ ఫోన్ లాక్కుందని లెక్చరర్ ను అసభ్యంగా తిట్టడంతో పాటు చెప్పుతో కొట్టింది. ఈ ఘటనపై రఘు విద్యాసంస్థల చైర్మన్ రఘు ప్యాకల్టీతో సమావేశమై ఘటనపై చర్చించారు. తాజాగా దీనిపై కాలేజీ యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. లెక్చరర్ పై దాడికి సంబంధించిన ఘటనపై విచారణ జరిపించామని యాజమాన్యం పేర్కొంది. లేడీ ఫ్యాకల్టీపై చేయిచేసుకోవడం, తిట్టడం వంటి చర్యల కారణంగా ఈసీఈ సెకండ్ ఇయర్‌కు చెందిన వెంకటలక్ష్మీ అనే విద్యార్థిని కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది. కాగా, విద్యార్థిని తనపై దాడి చేయడంతో మనస్తాపం చెందిన లెక్చరర్ రాజీనామా చేసినట్లు సమాచారం.

## డోలీలో ఆరు కిలోమీటర్లు !

### వైద్యం కోసం గిరిజనుల పాట్లు

రోలుగుంట ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):



అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ కొండ శిఖర గ్రామమైన నీలబంద పివిటిజి కొందు గిరిజన గ్రామానికి చెందిన బాలుడు గెమ్మెల సింహాద్రికి శరీరం మొత్తం కురుపులు రావడంతో ధర్మవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు శనివారం కుటుంబీకులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో గ్రామం నుంచి ఆరు కిలోమీటర్లు మేర నడక సాగిస్తూ ఎత్తైన కొండలు ఎక్కి దిగుతూ డోలీ మోతతో సింహాద్రిని రావికమతం మండలం కుంజుర్తి గ్రామానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోలో ధర్మవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ పివిటిజి గ్రామానికి నేటికీ ఆశా కార్యకర్త లేరు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తినా, ఇతర అవసరాలు తీర్చుకోవాలన్నా డోలీ మోతలే శరణ్యమవుతున్నాయి. తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని, గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు గెమ్మెలి చిన్నా, గెమ్మెలి అప్పారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె .గోవిందరావు కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే డోలీ మోతలతో నిరసన చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

## ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే పోస్టల్ విడుదల



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ 8 గంటల పని విధానం కోసం ప్రాణాలు త్యాగం చేసిన కార్మికులను స్మరించుకుంటూ కార్మికుల హక్కులకు నాంది పలికిన మేడే,ను విజయవంతం చేయాలని మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్, రద్దు కోసం కార్మికులు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. 8 గంటల పని దినాన్ని పాలకులు వ్యతిరేకంగా అనేక జీవోలు తీసుకువస్తున్నారని దీనిని కార్మికులు ఐకమత్యంతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు, కనీస వేతనం, 26,000 అమలు కోసం మరియు ఇతర సదుపాయాల కోసం పోరాటం చేయాలని అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందని మేడేలు కార్మికులు పండుగల జరుపుకోవాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు,

# సభకు సర్వం సిద్ధం..

- ఎల్కతుర్తిలో విస్తృత ఏర్పాట్లు
- భారీ ఎత్తున జన సమీకరణ
- ఉమ్మడి జిల్లాల వారీగా జోన్లు
- పార్కింగ్ కోసం ఐదు జోన్లు
- ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు
- పెద్దఎత్తున పోలీసు బందోబస్తు
- సభ ఏర్పాట్లు పరిశీలించిన సిపి



తెలంగాణ బ్యూరో ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. లక్షలాదిమంది తరలిరానున్నందున ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎల్కతుర్తి లోని 1200 ఎకరాల విశాల ప్రాంగణంలో సభ నిర్వహణ కోసం ఏర్పాటు చేశారు. వాహనాల కోసం మరో వెయ్యి ఎకరాలలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. శనివారం మిగిలిన చిన్నాచితక పనులను పూర్తి చేశారు. సభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికోసం ప్రత్యేకంగా రూట్ మ్యాప్ ఖరారు చేశారు. నిర్దేశిత పార్కింగ్ స్థలాలలోనే ఉమ్మడి జిల్లాల వారీగా వాహనాలను పార్కింగ్ చేసే విధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. సభ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా భారీగా పోలీసులు విధులు నిర్వహించనున్నారు. అవసరమైన చోట్ల బీఆర్ఎస్ కు చెందిన వాలంటీర్లు కూడా ట్రాఫిక్ సమస్య లేకుండా చూసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సభా స్థలంతో పాటు పార్కింగ్ రూటు మాప్ తదితర వాటిని స్వయంగా పరిశీలించారు. 3040 వేల వాహనాలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. వేసవి తీవ్రత పెరిగినందున 10 లక్షల వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు, వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సభ కోసం ముందు జాగ్రత్తగా 200 జనరేటర్లను ప్రత్యేకంగా తెప్పించారు.

**బీఆర్ఎస్ చరిత్రలో మరో ఘట్టం**

తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ టీఆర్ఎస్ ఇటీవల బీఆర్ఎస్ గా మారింది. ఈ 25 ఏండ్లు తెలంగాణ కోసం, తెలంగాణ ప్రజల కోసమే పని చేసిన పార్టీగా ఆ పార్టీ నేతలు భావిస్తుంటారు. మరో 25 ఏండ్ల కోసం మార్గనిర్దేశం చేసేందుకు సభ పెడుతున్నామని చెబుతున్నారు. చరిత్రలో ఎల్కతుర్తి సభ మరో ఘట్టంగా నిలిచిపోతుందని భావిస్తున్నారు. తెలంగాణ ప్రజల 60 ఏండ్ల కలను సాకారం చేసింది. ఈ క్రమంలో 14 ఏండ్ల పాటు తెలంగాణ కోసం కొట్లాడారు. 10 ఏండ్ల పాటు తెలంగాణలో అధికారం చెలాయించారు. ప్రస్తుతం ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు.

**జిల్లాల వారీగా పార్కింగుకు ఐదు జోన్లు**

పార్కింగ్ కు సంబంధించి జోన్లో వారీగా రూట్ మ్యాప్ వివరాలు ఇలా ఉన్నాయి

**జోన్ 1:** వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావు పేట, కొత్తగూడెం, ఇల్లందు రూట్ - మల్లంపల్లి - గుండెప్పాడ్ - వంగహపాడ్ - యూ టర్న్ NH - 163 - హాసన్ పర్తి - ఎల్కతుర్తి

**జోన్ 2:** ఉమ్మడి నల్గొండ, రంగ రెడ్డి, హైదరాబాద్ & మహబూబ్ నగర్ నియోజవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర. ఖమ్మం నుండి వచ్చే వారికి మమునూర్ - నాయుడు పెట్రోల్ పంపు - టయోటా షో రూమ్ - కడిపికొండ బ్రిడ్జి - మడికొండ - NH 163 బై పాస్ రోడ్డు టోల్ గేట్ దేవన్నపేట - మేడిపల్లి - అనంత సాగర్, ఇతరులకు కరుణపురం - NH 163 బై పాస్ టోల్ గేట్ - దేవన్నపేట - మేడిపల్లి - అనంత సాగర్ పార్కింగ్

**జోన్ 3 :** జనగాం, స్టేషన్ ఘనపూర్ రూట్ - ధర్మసాగర్ - దేవనూర్ - దామెర - చింతలపల్లి పార్కింగ్

**జోన్ 4:** ఉమ్మడి కరీంనగర్ నియోజక వర్గాలు మరియు చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంత భాగం) రూట్ - కరీంనగర్ - హుజుర్నగర్ - కోతులనడుమ - గ్రానైట్ రోడ్ పార్కింగ్

**జోన్ 5:** ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు మరియు నిర్మల్, అదిలాబాద్, ఖానాపూర్, బోథ్ రూట్ - సిద్దిపేట - ముల్కనూర్ - ఇందిరా నగర్ పార్కింగ్లు ఏర్పాటు చేసినట్లు బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్భాస్కర్ చెప్పారు.

ఇదిలా ఉండగా సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆ పార్టీ అధినేత కేసిఆర్ ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే హరీష్ రావు ఇతర పార్టీ నాయకులు సభ ఏర్పాట్లను ఇప్పటికే పరిశీలించారు. జన సమీకరణకు భారీ ఎత్తున ప్రణాళికలు రూపొందించి అమలచేస్తున్నారు. ఈ సభ విజయవంతం పై సభలో ప్రసంగాలపై ఆ పార్టీ నాయకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. మరోసారి తెలంగాణపై కేసీఆర్, బీఆర్ఎస్ ముద్ర బలంగా వేయాలని లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఈ సభను నిర్వహిస్తున్నారు.



## ఈ రోడ్డుకు మోక్షం లేదా

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ చౌరస్తా నుండి లక్ష్మారావు గూడెం వరకు కంకర తేలి గుంతల మయంగా మారింది. ఈ రహదారి పోతుగల్ నుండి, లక్ష్మారావు గూడ మీదుగా సీడ్ ఫామ్ వెళ్లే రహదారి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2023 చివరిలో ఎన్నికల కంటే ముందు ఈ రోడ్డు పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రోడ్డు పనులు ప్రారంభించి రోడ్ సైడ్ తో పాటుగా చిన్న గుంతలు గా ఉన్న రోడ్డును కొత్త రోడ్డు వేస్తామంటూ అక్కడక్కడ రోడ్డు పనులు వదిలేశారు. దీని కారణంగా రోడ్డుపై వాహనాలు తిరగడంతో గుంతలుగా మారాయి ప్రయాణికుల బాధలను ఇప్పటికైనా పోతుగల్ చౌరస్తావ మీదుగా కార్యచరణ చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి పిరికిపంద చర్య



**ఆర్ పెద్ద శ్రీనివాస్ రెడ్డి టిడిపి సీనియర్ నేత**

పెద్దమందడి ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం పై, యాత్రికులపై ఇస్లామిక్ ఉగ్రదాడిని ఖండిస్తూ, అలాగే ఈ సంఘటనలో అసువులు బాసిన మృతులకు నివాళులర్పిస్తున్నానని పెద్దమందడి టిడిపి పార్టీ సీనియర్ నేత ఆర్ పెద్ద శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబాలకు న్యాయం జరగాలని, ఈ సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనల్లో భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జమ్ము కాశ్మీర్లో ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చు కుంటున్న తరుణంలో పహల్గామ్ ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మతం అడిగి మరి మరనాకాండ సృష్టించడం, పేర్లు అడిగి, ఖురాన్ సూక్తులు చెప్పించి, ముస్లిం కాదని నిర్ధారించుకొని మరి కాల్చడం హెయమన్నారు. ఉగ్రముక ల దాడి ఇదొక క్రూరమైన అమానీయమని, పర్యాటకులను అమాయక పౌరులను, ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అని అన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు అన్నారు. దాడి ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దొంగ దెబ్బలతో భారతీయులు ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరని పేర్కొన్నారు. ఉగ్రవాదులు చేసిన దాడులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అమాయక ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల పట్ల భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దమందడి మండల టిడిపి పార్టీ సీనియర్ నేత ఆర్ పెద్ద శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

## నాపై దాడి చేసిన వారిని వదిలేది లేదు
# దాడికి అదే కారణం కావొచ్చు

- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్
- దాడి చేసిన వారిపై న్యాయపోరాటం చేస్తానన్న రంగరాజన్
- ఫిబ్రవరి 7న తన నివాసంలోకి వచ్చి దాడి చేశారని వెల్లడి
- ఈ దాడి వెనుక ఆలయానికి సంబంధించిన కోర్టు వివాదమే కారణం కావొచ్చని అనుమానం
- దీని వెనుక ఎంతటి వారున్నా వదిలేది లేదని వ్యాఖ్య

మొయినాబాద్ ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తనపై రెండు నెలల క్రితం జరిగిన దాడి ఘటనపై తీవ్రంగా స్పందించారు. దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దాడి ఘటన వివరాలను రంగరాజన్ వివరిస్తూ, "ఫిబ్రవరి 7వ తేదీన కొందరు వ్యక్తులు మా ఇంటికి వచ్చి తలుపులు తట్టారు. అప్పుడు నేను స్నానం చేయనందున టీషర్టులో ఉన్నాను, ఇప్పుడు ఎవరినీ కలవలేనని చెప్పాను" అని తెలిపారు. వారిలో నల్ల బట్టలు ధరించిన ఒక వ్యక్తి, 'రామరాజ్యం కోసం పనిచేసే వారిని కలవడానికి మీకు సమయం లేదా?' అంటూ 'టేక్ హిమ్ కస్టడీ' అని అన్నట్లు రంగరాజన్ గుర్తుచేసుకున్నారు. ఆ వ్యక్తి మాటలు విని ఎవరో పెద్ద అధికారి అయి ఉంటారని తాను భావించినట్లు చెప్పారు. అనంతరం, సుమారు 20 మంది వ్యక్తులు ఒక్కసారిగా తలుపులు తోసుకుని ఇంట్లోకి ప్రవేశించారని రంగరాజన్ ఆరోపించారు. "వారు నన్ను కాళ్లు పట్టి లాగి కిందపడేసి దాడి చేశారు. ఈ ఘటనతో నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను" అని ఆయన వివరించారు. ఈ దాడిని తేలిగ్గా తీసుకునేది లేదని, దీనిపై కచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిపై సివిల్, క్రిమినల్ పరువు నష్టం దావాలు వేస్తామని తెలిపారు. ఈ దాడి వెనుక ఆలయానికి సంబంధించిన కోర్టు వివాదమే కారణమని రంగరాజన్ అనుమానం వ్యక్తం చేశారు. "ఆలయానికి సంబంధించిన విషయం కోర్టు పరిధిలో ఉంది. ఈ దాడి వెనుక ఎంత పెద్దవారు ఉన్నా సరే, శిఖండిలా తెర వెనుక ఉండి వ్యవహరించవద్దు" అని ఆయన వ్యాఖ్యానించారు. తమపై ఆరోపణలు చేసేవారు కోర్టులో వాదనలు వినిపించి, తాము తప్పు చేయలేదని నిరూపించుకోవాలని రంగరాజన్ సవాలు విసిరారు.




## రోడ్ల విస్తరణకు వ్యాపారుల అడ్డంకు

- మార్కింగ్ వేస్తుంటే అడ్డుకున్న వ్యాపారులు
- రోడ్డు కబ్జా చేసిన వారి షాపులు తొలగించండి
- పాత లేఅవుట్ పద్ధతిలో విస్తరించండి
- మా జోలికి రావద్దు మేము నష్టపోతాం

వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ అధికారులకు పెద్ద సమస్యగా మారింది. గతంలో పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల నుండి అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్, గణపురం రోడ్డు, గోపాల్పేట్ రోడ్డు విస్తరణ పనులు ఎలాంటి అడ్డంకులు లేకుండా వ్యాపారులకు నచ్చజెప్పి రోడ్ల విస్తరణ పూర్తి చేశారు. అయితే పానగల్ రోడ్డు, పెబ్బేరు రోడ్డు, కొత్తకోట రోడ్డు విస్తరణ పనులు మిగిలి ఉన్నాయి. అయితే పాలిటెక్నిక్ కళాశాల నుండి పెబ్బేర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని అధికారులు ముందుకు రాగా రోడ్డుపై ఉన్న కొందరు షాపు యజమానులు అడ్డుకుంటున్నారు. రోడ్డును కబ్జా చేసిన వారిని తొలగించి మా వద్దకు రావాలని అధికారులను హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేక తల పట్టుకుంటున్నారు. వాస్తవంగా 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టాలి. ప్రభుత్వ స్థలాల దగ్గర 100 ఫీట్ల రోడ్డు, ప్రైవేటు స్థలాల దగ్గర 95 సీట్లు రోడ్డు విస్తరించాలని నిర్ణయించారు. పాలిటెక్నిక్ కళాశాల ముందు ఉన్న కొంతమంది వ్యాపారులు 95 ఫీట్ల రోడ్డు వేయటానికి ఒప్పుకోవడం లేదు. మిగతా చోట విస్తరణ పనులకు అడ్డు తగలకుండా అంగీకరిస్తున్నారు. కొందరు స్వయంగా తమ షాపులను రోడ్డు విస్తరణకు అనుగుణంగా వెనక్కి జరిగి నిర్మించుకున్నారు. మరికొందరు రోడ్డు విస్తరణ వల్ల సర్వం కోల్పోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు రోడ్డు పాత లేఅవుట్ చూపి దాని ప్రకారము విస్తరణ చేయాలని అంటున్నారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి.

**ఎమ్మెల్యే గారు ఇచ్చిన మాట ఏమైంది**

వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి కొద్దిరోజులు క్రితం వ్యాపారులు ఏలాంటి ఆందోళన చెందవద్దని మీకు షాపులు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అది నెరవేరక ముందే మా షాపులను కూల్చివేయడానికి అధికారులు వస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఎలాగైనా ఎమ్మెల్యే మెగా రెడ్డి, జిల్లా కలెక్టర్ రోడ్ల విస్తరణలో మాకు నష్టం జరగకుండా ఆదుకోవాలని అంటున్నారు. జిల్లా కలెక్టర్ రోడ్డు విస్తరణ కోసం అడ్డు తగులుతున్న వ్యాపారులతో చర్చించి ఎమ్మెల్యే ద్వారా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.



## పాకిస్థాన్ నటుడితో ఉన్న పోస్ట్ డిలీట్ చేసిన బాలీవుడ్ నటి



జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇదిలా వుంటే.. ఈ ఘటన అనంతరం పాకిస్థాన్‌కి చెందిన నటులపై మళ్లీ వ్యతిరేకత మొదలైంది. పుల్వామా దాడి ఘటన అనంతరం పాకిస్థాన్‌కి చెందిన నటులు ఇండియన్ సినిమాలలో నటించడం మానేశారు. అయితే చాలా రోజుల తర్వాత పాకిస్థాన్‌కి చెందిన నటుడు ఫవాద్ ఖాన్ మళ్లీ ఒక బాలీవుడ్ సినిమాలో నటించబోతున్నాడు. బాలీవుడ్ నటి వాణీకపూర్, పాకిస్థాన్ స్టార్ ఫవాద్ ఖాన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'అబీర్ గులాల్'. ఆర్తి ఎస్. బాగ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుంది. ఈ చిత్రం మే 09న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ చేసింది చిత్రయూనిట్. అయితే ఈ సినిమా ప్రమోషనన్స్‌లో భాగంగా.. వాణీ కపూర్ ఫవాద్ ఖాన్‌తో ఉన్న 'అబీర్ గులాల్' పోస్టర్‌ను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. అయితే ఈ ఉగ్రదాడి ఘటనపై స్పందించకుండా పాకిస్థాన్ నటుడితో సినిమాను చేయడమే కాకుండా ప్రమోషన్స్ చేస్తుందంటూ వాణీ కపూర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఈ వివాదం ఇంకా ముదురుతుండడంతో తాజాగా ఆ పోస్ట్‌ను వాణీ డిలీట్ చేసింది.

## నో ఎలా చెప్పాలో తెలిసేది కాదు



పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులేయాల్సిన సమయం వచ్చేసిందని కథానాయిక పూజా హెగ్డే అంటుంది. కొన్నేళ్లుగా తెలుగులో ఈమె సందడి తక్కువైనా.. తమిళంలో మాత్రం వరుస అవకాశాలతో జోరు చూపిస్తోంది. ఆమె, సూర్య జంటగా నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా వచ్చే నెల 1న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజ.. తన సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "త్వరలో రాబోయే 'రెట్రో' సినిమా నన్ను పూర్తి భిన్నంగా చూపిస్తుంది. నా సామర్థ్యాన్ని పరీక్షించింది. యాక్షన్, డ్యాన్స్, భావోద్వేగాల కలయికతో రూపొందిన ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నా. ఈ సినిమా దర్శకుడు మొదటి రోజు స్క్రిప్ట్ కోసం కలవబోతున్నప్పుడు.. నన్ను మేకప్ లేకుండా రమ్మని చెప్పారు. నాకు మేకప్ లేకుండా సహజంగా కనిపించే సినిమాల్లో పనిచేయడమంటే చాలా ఇష్టం. 'రాధే శ్యామ్' సినిమాలో నా నటనలో భావోద్వేగాల్ని చూసి 'రెట్రో'కు సరిగ్గా సరిపోతానని నన్ను తీసుకున్నారట దర్శకుడు. పదేళ్లకు పైగా చిత్రపరిశ్రమలో రాణిస్తున్న నాకు తమిళ పరిశ్రమ మొదటి చిత్రం ఇచ్చింది. తెలుగు సినిమా నన్ను నటిగా తీర్చిదిద్దింది. ఈ క్రమంలోనే హిందీలో వైవిధ్యమైన పాత్రల్ని ఎంచుకొనే అవకాశం వచ్చింది. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు కొత్త పాఠాలు నేర్చుకున్నా. కానీ కెరీర్ ప్రారంభంలో నాకు ఎలా నో చెప్పాలో తెలియదు. కొంచెం అసౌకర్యంగా అనిపించినా సినిమా చేయడానికి అంగీకరించేదాన్ని. ఇప్పుడా పరిస్థితుల నుంచి బయటికొచ్చేశాను. నేను పోషించగల పాత్రల్ని ధైర్యంగా ఎంచుకోగలుగుతున్నా. ఎంచుకున్న పాత్రలతోనే నేనెంటో తెలుసుకుంటున్నా అంటూ ఈ బుట్టబొమ్మ తన ప్రయాణం గురించి చెప్పుకొచ్చింది.

## ఆమెను ఆరాధించా..



తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాని ఎప్పుడూ ముందుంటారు. ఆయన నటించిన తాజా సినిమా 'హిట్ 3'. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా గడపుతున్నారు నాని. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఇష్టమైన హీరోయిన్ గురించి చెప్పారు." నాకు శ్రీదేవి అంటే ఎంతో ఇష్టం. ఆమెను ఆరాధించా. 'క్షణ క్షణం' సినిమా ఎన్నిసార్లు చూశానో లెక్కలేదు. లక్షల సార్లు చూడగలిగిన చిత్రమది. ఆమె అంత అందంగా ఎలా ఉన్నారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. ఆ సినిమాకే శ్రీదేవి అందాన్ని తెచ్చారు" అని తెలిపారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో 'హిట్ 3', అజయ్ దేవ్‌గణ్ 'రైడ్ 2' ఒకే రోజు విడుదలవుతున్నాయి కదా.. పోటీ తప్పదా అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చారు. "రైడ్ 2'కు ప్రాధాన్యమివ్వండి. అజయ్ సర్‌తో నాకు పోటీ లేదు. మీకు వీలుంటే 'హిట్ 3'ను థియేటర్‌లో చూడండి" అని చెప్పారు.

## సావిత్రి చివరి కోరిక అదేనా..!



మహానటి సావిత్రి జీవితం.. తెరిచిన పుస్తకం. ఆమె గురించి ఎంతో మంది కథలు కథలుగా చెబుతూ ఉంటారు. తన జీవితాన్ని 'మహానటి' పేరుతో సినిమా కూడా తీశారు. ఆమె సినిమాల్లోకి ఎలా వచ్చింది. ఎలా ఎదిగింది? ఎలా రాజవైభవం చూసింది. ఎలా డౌన్ అయ్యింది. చివరికి ఎలా విషాదాంతంగా ఆమె జీవితం ముగిసిందనేది అందరికి తెలిసిందే. కానీ తోడే కొద్ది కొత్త విషయాలు వస్తూనే ఉన్నాయి. ఆమెతో పని చేసినవాళ్లు ఏదో ఒక కొత్త విషయం చెబుతూనే ఉన్నారు. అందులో భాగంగా ఓ కొత్త విషయం బయటకు వచ్చింది. సావిత్రి ఎంత ప్రతిభ ఉందో, అంతే ఇన్నోసెంట్ కూడా. గుడ్డిగా అందరిని నమ్మే తత్వం ఆమె జీవితాన్ని తలక్రిందులు చేసింది. మొండి పట్టుదల కూడా జీవితంలో పెద్ద దెబ్బ కొట్టింది. భర్త జెమినీ గణేషన్ తనని మోసం చేయడాన్ని ఆమె తట్టుకోలేకపోయింది. దర్శకురాలిగా మారి, నిర్మాతగా మారి బాగా నష్టపోయింది. కొందరు రాజకీయ నాయకుల కుట్రలకు బలయ్యింది. మొత్తంగా తన జీవితం విషాదంగా ముగిసింది. అయితే సావిత్రి చివరి రోజుల్లో తన చివరి కోరిక కోరుకుందట. అప్పట్లో సీనియర్ జర్నలిస్ట్ గా ఉన్న నందగోపాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. "మరణంలోనూ జీవితంలోనూ ఒక మహోన్నతమైన తార ఇక్కడ శాశ్వత విశ్రాంతిని పొందుతుంది. ఇక్కడికి ఎవరు వచ్చినా సానుభూతితో కన్నీళ్లని విడవనక్కర్లేదు. ఈ సమాజంలో ఎవరూ కూడా హీనంగా చూడకుండా మరణం లేని ఈ సమాధిలో నిద్రిస్తున్న మహా ప్రతిభకి చిహ్నంగా ఒక పూలమాలని ఉంచండి. ఇదే నాకు మీరిచ్చే గౌరవం' అని సావిత్రి కోరుకున్నారట. మరి అది తన సమాధిపై రాశారా? లేదా అనేది తెలియదు. కానీ ఆమె చివరి కోరిక ఇదే అని వెల్లడించారు.

## నేను పాకిస్థానీని కాదు



కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని యావద్భారతం ఖండించింది. అయితే పాకిస్థాన్ నటీనటులు మన సినిమాల్లో నటించడానికి వీల్లేదంటూ నెట్టింట పోస్ట్‌లు షేర్ అవుతున్నాయి. దీంతో ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో హీరోయిన్ ఇమాన్వీ ఎస్మాయిల్ ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారారు. ఆమె పాకిస్థానీ అంటూ.. ఆమెను తీసుకోవద్దంటూ పోస్ట్‌లు షేర్ అవుతున్నాయి. ఈ విషయంపై ఇమాన్వీ క్లారిటీ ఇచ్చారు. తాను పాకిస్థానీ నటిని కాదని స్పష్టంచేస్తూ పోస్ట్ పెట్టారు. తాను తన పోస్ట్‌లో ఇలా రాసుకొచ్చారు." నాకు, నా కుటుంబానికి సంబంధించిన కొన్ని తప్పుడు వార్తలు నెట్టింట ప్రచారం అవుతున్నాయి. నేను పాకిస్థానీని కాదు. నాకు, నా కుటుంబంలోని ఎవరికీ ఆ దేశంతో సంబంధాలు లేవు. నాపై ద్వేషాన్ని కలిగించాలనే ఏకైక ఉద్దేశంతో ఇలాంటివి ప్రచారం చేస్తున్నారు. నేను భారత అమెరికన్‌ని అని గర్వంగా చెబుతాను. హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లిష్ మాట్లాడగలను. లాస్ ఏంజెలెస్‌లో పుట్టాను. నా తల్లిదండ్రులు అమెరికాకు వలసవెళ్లి.. అక్కడి పౌరులుగా మారారు. నేను చదివింది కూడా అక్కడే. చదువు పూర్తయిన తర్వాత నటిగా, కొరియోగ్రాఫర్‌గా, డ్యాన్సర్‌గా కెరీర్‌ను ప్రారంభించాను. ఈ రంగంలో ఎంతోకాలం కొనసాగిన తర్వాత భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పనిచేసే అవకాశాలను అందుకున్నాను. ఈ విషయంలో ఎంతో ఆనందంగా ఉన్నాను. సినిమా నా జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపిందని క్లారిటీ ఇచ్చింది" . సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించండి అని కోరింది.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330